బుధవారం
25-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 95
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'ట్రామ్'లకు బెంగాల్ గుడ్‌బై!

కోల్‌కతా:
కోల్‌కతాలో ప్రసిద్ధిగాంచిన ట్రామ్‌లు కనుమరుగు కానున్నాయి. ఈ రవాణా సేవలను నిలిపివేసేందుకు బెంగాల్ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర రవాణా మంత్రి చక్రవర్తి మంగళవారం వెల్లడించారు. నెమ్మదిగా నడిచే ట్రామ్‌ల కారణంగా రద్దీ వేళల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని, వాహనదారుల ఇబ్బంది దృష్ట్యా వీటి సేవలను నిలిపి వేయాలని నిర్ణయించామని ఆయనన్నారు. మైదాన్- ఎస్‌ప్లనేడ్ మార్గంలో మాత్రం మరికొంతకాలం వీటిని కొనసాగిస్తామని చక్రవర్తి చెప్పారు. కాగా ట్రామ్ సేవలకు గతేడాదితో 150 ఏళ్లు పూర్తి అయిన విషయం తెలిసిందే.

ఈ తరం దార్శనికుడు బర్ధన్ శతజయంతి నేడు

1924- 2024

బహుముఖ ప్రజ్ఞాశాలి, కార్మికవర్గ నేత, సంక్షుభిత, సంకీర్ణ రాజకీయాల శకంలో సీపీఐ ప్రధాన కార్యదర్శిగా పార్టీని సమర్థవంతంగా నడిపిన అగ్రశ్రేణి నాయకుడు అర్ధేందు భూషణ్ బర్ధన్ (ఏబీ బర్ధన్). విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు రాజకీయాల వైపు ఆకర్షితున బర్ధన్ తర్వాత కార్మికోద్యమాల్లో రాటుతేలారు. భారత కమ్యూనిస్టు పార్టీకి పాతిక సంవత్సరాలు మార్గనిర్దేశనం చేశారు.

- ప్రత్యేక వ్యాసం 4 లో

3,736 మద్యం షాపులకు వేలం

- నోటిఫికేషన్ సిద్ధం
- ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదించిన వెంటనే విడుదల
- కల్లుగీత వృత్తిదారులకు ప్రత్యేకంగా 10 శాతం షాపులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
రాష్ట్రంలో అక్టోబరు మొదటివారంలో అమల్లోకి రానున్న నూతన పాలసీ ప్రకారం కొత్త మద్యం షాపుల నోటిఫికేషన్ విడుదలకు ఎక్సైజ్‌శాఖ సిద్ధమవుతోంది. ఇప్పటికే నూతన విధానం ప్రకారం విధి విధానాలు రూపొందించిన ఎక్సైజ్ శాఖ... రేపో, మాపో నోటిఫికేషన్ జారీ చేసేందుకు సన్నద్ధమైంది. రాష్ట్రంలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించేలా గత వైసీపీ ప్రభుత్వం చట్టం చేసింది. ఆ చట్టాన్ని సవరించి ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల నిర్ణయించింది. ఈ ఆర్డినెన్స్ ఆమోదం కోసం సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ వద్దకు పంపనుంది. గవర్నర్ ఆమోదం తెలిపిన వెంటనే... రాష్ట్రంలో మొత్తం 3,736 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఇందులో 10 శాతం మద్యం

- మిగతా 2 లో

తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారం

సిట్ అధిపతిగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి

సభ్యులుగా విశాఖ డీఐజీ గోపీనాథ్, కడప ఎస్పీ హర్షవర్ధన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై విచారణకు సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిట్ చీఫ్‌గా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ప్రభుత్వం నియమించింది. సభ్యులుగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజుతోపాటు

- మిగతా 2 లో

రైతుల ప్రసన్నత కోసం

కేంద్రం పాట్లు

- వ్యవసాయమంత్రి చౌహాన్‌తో ఎంఎస్‌పీపై చర్చలు
- కేంద్రం ముందు నాలుగు ప్రతిపాదనలు

న్యూఢిల్లీ:
ఎన్నికల వేళ రైతులను ప్రసన్నం చేసుకునేందుకు కేంద్రం నానాతంటాలు పడుతోంది. ప్రత్యేకించి హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుకోసం రైతులతో సంప్రదింపులు ప్రారంభించింది. అన్నదాతల ఆగ్రహంతో లోక్‌సభ ఎన్నికల్లో డీలాపడిన బీజేపీ...తిరిగి కోలుకొనేందుకు యత్నిస్తోంది. రైతన్నతల మద్దతు పొంది అసెంబ్లీ ఎన్నికల్లో ప్రయోజనం పొందాలని కాంక్షిస్తోంది. త్వరలోనే హర్యానా అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే జమ్మూకశ్మీర్ ఎన్నికల తొలిదశ పోలింగ్ ముగిసింది. జార్ఖండ్‌లోనూ అక్టోబరులో ఎన్నికలు జరుగుతాయి. ఈ పరిస్థితుల్లో రైతు నేతలతో చర్చలకు కేంద్రప్రభుత్వం

పూనుకుంది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో పాటు పెండింగ్ సమస్యల పరిష్కారంపై మంగళవారం తొలి విడత చర్చలు జరిపింది. దిల్లీలోని ఐసీఏఆర్-పుసా కాంపెక్స్‌లో జరిగిన ఈ సమావేశానికి 50 మంది రైతు నేతలు హాజరయ్యారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షత వహించారు. ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ నుంచి బీకేయూ (రాజకీయేతర) ప్రతినిధులు పాల్గొన్నారు. తమ డిమాండ్ల పత్రాన్ని చౌహాన్‌కు అందజేశారు. తొలుత చౌహాన్ మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ చర్చలు సత్ఫలితాలు ఇస్తాయని ఆకాంక్షించారు. ఎంఎస్‌పీపై వచ్చిన సూచనలన్నింటినీ పరిశీలిస్తామని హామీనిచ్చారు. బీకేయూ జాతీయ అధికార ప్రతినిధి అరజ్ఞైతిక్ మాట్లాడుతూ 'ఎంఎస్‌పీ,

- మిగతా 2 లో

పదవుల జాతర

20 కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్ పోస్టుల భర్తీ

టీడీపీ-16, జనసేన-3, బీజేపీ-1

ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ల నారాయణ

కొనకళ్ల నారాయణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:
రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల జాతర మొదలైంది. దీంతో కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన, భారతీయ జనతా పార్టీల్లో సందడి మొదలైంది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో ప్రకటించారు. దీంతో పై మూడు రాజకీయపార్టీల్లో ఆశావహులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రి 20 కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులను భర్తీ చేశారు. పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో పని చేసిన వారు, అలాగే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ దక్కని వారు, పొత్తుల్లో భాగంగా తమ సీట్లు త్యాగం చేయాల్సి వచ్చిన వారిని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు ఈ నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా తొలి విడతగా 99 మందిని నామినేటెడ్ పోస్టులకు ఆయన ఎంపిక చేశారు. 20 కార్పొరేషన్లకు చైర్మన్‌లు, సభ్యులను నియమించారు. ఈ నియామకాల్లో సామాన్య కార్యకర్తలకు, బీసీ, ఎస్సీ, మైనార్టీ, ఎస్టీలకు ప్రాధాన్యం దక్కింది. ఇందులో భాగంగా 11 మంది క్లస్టర్ ఇంఛార్జ్‌లకు పదవులు కేటాయించారు. ఒక క్లస్టర్ ఇంచార్జిని చైర్మన్ పదవిలో నియమించింది. అలాగే ఆరుగురు యూనిట్ ఇంఛార్జ్‌లకు పదవులు దక్కాయి. కాగా నామినేటెడ్ పోస్టుల్లో 99 శాతం పదవులు యువతకే కేటాయించడం విశేషం. నామినేటెడ్ పోస్టుల భర్తీలో సీఎం చంద్రబాబు టీడీపీతో పాటు జనసేన, బీజేపీ నేతలకు స్థానం కల్పించారు. టీడీపీ -16, జనసేన -3, బీజేపీ -1 చొప్పున మొత్తం 20 నామినేటెడ్ పోస్టుల్ని భర్తీ చేశారు. ఆర్టీసీ చైర్మన్ గా టీడీపీ మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, వక్ఫ్ బోర్డు చైర్మన్ గా అబ్దుల్ అజీజ్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ గా లంకా దినకర్(బీజేపీ), శాప్ చైర్మన్ గా అనిమిని రవి నాయుడు, పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్‌గా తోట మెహర్ సీతారామ సుధీర్(జనసేన), ఏపీ హౌసింగ్ బోర్డ్‌కు బత్తుల తాత్యబాబు, ఏపీ ట్రైకార్‌కు బొరగం శ్రీనివాసులు, ఏపీ మారిటైమ్ బోర్డుకు దామచర్ల సత్య, ఉపాధి కల్పన అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ సొసైటీకి దీపక్ రెడ్డి, మార్క్‌ఫెడ్‌కు కర్రోతు బంగార్రాజు, స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు మన్నె సుబ్బారెడ్డి, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ)కు మంతెన రామరాజు, పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి సంస్థకు నందం అబద్దయ్య, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నూకసాని బాలాజీ, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ గా పీఎస్ మునిరత్నం, ఏపీ అర్బన్

- మిగతా 2 లో

జమ్మూకశ్మీరు రెండో దశ పోలింగ్ నేడు

రాజౌరి:
జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ బుధవారం జరుగుతుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఎన్నికల సంఘం పూర్తి చేసింది. ఇప్పటికే మొదటి దశ పోలింగ్ ముగిసింది. రెండో దశలో ఆరు జిల్లాల్లో 26 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తారు. ఎన్నికలు జరిగే ప్రాంతాలలో భద్రతా దళాలను మోహరించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా, కంగన్ (ఎస్టీ), గందర్‌బల్, హజ్రత్‌బాల్, ఖన్యార్, హబ్బకదల్, లాల్ చౌక్, చన్నపోరా, జదిబాల్,

- మిగతా 2 లో

ఇలాంటి వ్యక్తి రాజ్యాంగ పదవికా?

- తమిళనాడు గవర్నరుపై ముప్పేటదాడి
- రవి వ్యాఖ్యలపై భగ్గుమన్న విపక్షాలు
- సెక్యులరిజం అంటే ఆయనకు తెలియదు: డి.రాజా

న్యూఢిల్లీ/చెన్నై:
భారత్‌లో లౌకికవాదాని (సెక్యులరిజం)కి స్థానం లేదంటూ తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి చేసిన అనుచిత వ్యాఖ్యలపై విపక్షాలు భగ్గుమన్నాయి. రాజ్యాంగం కూడా విదేశీ భావన అని ఆయన భవిష్యత్తులో చెప్పవచ్చని విమర్శించాయి. ఇలాంటి వ్యక్తిని రాజ్యాంగ బద్ధ పదవిలో ఎలా నియమించారని కేంద్రంలోని మోదీ సర్కారును ప్రశ్నించాయి. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా గవర్నర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ కూడా "ధర్మ పరిపాలన భావనను" తిరస్కరించారని అన్నారు. 'అతనికి సెక్యులరిజం గురించి, భారతదేశం గురించి ఏం తెలుసు?

- మిగతా 2 లో



ఎన్ఆర్ఐ కోటా అంతా మోసం

ఎంబీబీఎస్ ప్రవేశ నిబంధనపై సుప్రీం

న్యూఢిల్లీ:
ఎంబీబీఎస్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం ఇటీవల పంజాబ్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్ఆర్ఐ కోటా నిబంధనను సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఆ కోటా మోసం తప్ప మరొకటి కాదని వ్యాఖ్యానించింది. ఎన్ఆర్ఐ అభ్యర్థి అనే పదం పరిధిని విస్తృతం చేస్తూ పంజాబ్ ప్రభుత్వం కొన్నిరోజుల క్రితం నోటిఫికేషన్ ఇచ్చింది. ఎన్ఆర్ఐ

- మిగతా 2 లో

బందరులో హైడ్రా తరహా

కూల్చివేతలు

మడుగు భూమిలో ఆక్రమణల తొలగింపు

నేలమట్టమైన 180 గృహాలు

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం:
కృష్ణాజిల్లా మచిలీపట్నంలో హైడ్రా తరహాలో ఆక్రమణల తొలగింపునకు నగర పాలక సంస్థ అధికారులు తెరలేపారు. స్థానిక మూడు స్తంభాల సెంటర్ సమీపంలోని మడుగు పోరంబోకు భూమిలో అక్రమంగా నిర్మించిన 180 గృహాలను భారీ బందోబస్తు మధ్య అధికారులు కూల్చివేశారు. స్థానిక కుమ్మరిగుడెంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న 22 ఎకరాల మడుగుభూమిలో గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పేర్ని నాని పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు విద్యుత్ కనెక్షన్లు కూడా ఇప్పించి వారితో గృహ నిర్మాణాలు చేయించారు. ఆ చర్యలను అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న కొల్లు రవీంద్ర తీవ్రంగా ప్రతిఘటించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మడుగు భూమిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే

- మిగతా 2 లో

త్వరలో వర్సిటీ పోస్టుల భర్తీ

- ఒకే చట్టం పరిధిలోకి విశ్వవిద్యాలయాలు
- ర్యాంకింగ్‌కు ఐదేళ్ల కార్యాచరణ
- పీపీపీ విధానంలో అమరావతిలో ఏఐయూ
- రాజధాని నవనగరాల్లో క్రీడాగ్రామం
- ఉన్నత విద్యాశాఖపై సమీక్షలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
త్వరలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి... ప్రమాణాల పెంపునకు చర్యలు తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఉన్నత విద్యాశాఖపై సీఎం బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ అసమర్థ విధానాలు, చిన్నచూపు కారణంగా ఉన్నత విద్యారంగం గాడి తప్పిందన్నారు. దీనిని తిరిగి పట్టాలెక్కించి... మంచి ఫలితాలు సాధించేందుకు స్వల్పకాలిక, దీర్ఘ కాలిక కార్యక్రమాలు చేపట్టాలని, ప్రభుత్వ యూనివర్సిటీల బలోపేతంపై తక్షణం దృష్టిపెట్టాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అదే సమయంలో జాతీయ, అంతర్జాతీయస్థాయి ప్రైవేటు యూనివర్సిటీలకు ప్రోత్సాహం ఇవ్వాలని, తద్వారా



విద్యారంగంలో అవకాశాలు పెరుగుతాయన్నారు. యూనివర్సిటీల్లో అధ్యాపకులు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి న్యాయపరమైన సమస్యలు పరిష్కరించడానికి కొత్తగా నోటిఫికేషన్‌లు ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 48 ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీలు ఉండగా, వీటి పరిధిలో 2061 కాలేజీలు, 19.29 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని అధికారులు తెలిపారు. అనేక సమస్యలతో ప్రభుత్వ యూనివర్సిటీలలో ప్రమాణాలు పడిపోయాయని, వీటిని సరిదిద్ది యూనివర్సిటీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్ సాధించేలా ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక మొదలు పెట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం యూనివర్సిటీలకు సంబంధించి 8 చట్టాలు అమల్లో ఉన్నాయని, ఇకపై వీటన్నింటి స్థానంలో ఒకే చట్టం తీసుకు వచ్చే ప్రతిపాదనలకు సీఎం అంగీకారం తెలిపారు. బోర్డు ఆఫ్ గవర్నెన్స్ చైర్‌పర్సన్స్‌గా ప్రముఖ ప్రముఖ పారిశ్రామికవేత్తలను నియమించే విధానం పాటించాలన్నారు. ఐఐఎం,

- మిగతా 2 లో

టెట్ అవస్థలు !

- ఒక పేపర్‌కు అనేక సెషన్లలో పరీక్షలు
- ప్రశ్నల సరళిపై అభ్యర్థుల్లో ఆందోళన
- దూర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలు
- మూగబోయిన హెల్ప్‌లైన్ నంబర్లు
- సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అభ్యర్థుల వేడుకోలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఉపాధ్యాయ విద్యార్హత పరీక్ష(ఏపీ టెట్)-2024 పరీక్షల వ్యవహారం గందరగోళంగా మారింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంతో నిర్వహిస్తున్న టెట్ పరీక్షల (ఒక పేపర్)కు రోజుల తరబడి షెడ్యూలు రావడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో మాన్యువల్‌గా ఏకకాలంలో ఒకే పరీక్షను నిర్వహించగా... ఇప్పుడు ఒకే పరీక్షను అనేక దఫాలుగా నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి ప్రధాన కారణం సీబీటీ విధానానికి అనుకూలమైన పరీక్షా కేంద్రాల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

లంక ప్రధానిగా హరిణి అమరసూర్య ప్రమాణం

కొలంబో: శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య నియమితులయ్యారు. దీంతో మంగళవారం ఆమె ప్రమాణస్వీకారం చేశారు. సిరిమావో బండారు నాయకే (1994-2000) తర్వాత శ్రీలంకలో ప్రధాని పదవి చేపట్టిన మహిళా నేత హరిణి కావడం విశేషం. నేషనల్ పీపుల్స్ పవర్‌కి చెందిన 54 ఏళ్ల హరిణి అమరసూర్యతో ఆ దేశాధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయించారు. మరో ఇద్దరు నేతలను కేబినెట్ మంత్రులుగా నియమించారు. దీంతో శ్రీలంకలో దిసనాయకేతో పాటు మొత్తం నలుగురితో కూడిన కేబినెట్ కొలువుదీరింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన హరిణికి న్యాయ, విద్య, కార్మిక, పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక శాఖ, ఆరోగ్యం, పెట్టుబడులు వంటి కీలక శాఖలు కేటాయించారు. అధ్యక్ష ఎన్నికల అనంతరం అధికార మార్పిడిలో భాగంగా దినేశ్ గుణవర్ధన తన ప్రధాని పదవికి నిన్న రాజీనామా చేశారు. శ్రీలంకలో హక్కుల కార్యకర్తగా, యూనివర్సిటీ అధ్యాపకురాలిగా గుర్తింపు పొందిన హరిణి... ఆ దేశ మూడో మహిళా ప్రధానిగా చరిత్ర లిఖించారు. మరోవైపు, ఎన్‌పీపీకి చెందిన ఎంపీలు విజిత హెరాత్, లక్ష్మణ్ నిపుణరచిచి కేబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో దిసనాయకే సంచలన విజయం సాధించి... అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టారు.

అమెరికాకు అత్యంత మిత్రుడు మోదీ: గార్సెట్టి



న్యూయార్క్: భారత ప్రధాని నరేంద్రమోదీపై అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి ప్రశంసలు కురిపించారు. భారత దేశ చరిత్రలో అమెరికాకు బాగా దగ్గరైన ప్రధాని మోదీ అని, అమెరికా చరిత్రలో భారత్‌కు బాగా దగ్గరైన అధ్యక్షుడు బైడెన్ అని ఆయన కొనియాడారు. రెండు దేశాల ప్రజలకు ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న వీరిద్దరి మధ్య చాలా స్నేహపూరిత సంబంధాలున్నాయని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యానికి, సంబంధాలకు వారిద్దరి స్నేహమే కారణమని వ్యాఖ్యానించారు. భారత్, అమెరికా మధ్య పెరుగుతున్న స్నేహపూర్వక సంబంధాలు రెండు దేశాల్లో వ్యూహాత్మక, ఆర్థిక, సాయుధ, సాంస్కృతిక సహకారంలో వృద్ధికి సహకరిస్తాయని గార్సెట్టి అన్నారు. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లు సభ్యదేశాలుగా ఉన్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సును ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సహకారానికి శక్తివంతమైన వేదికగా పేర్కొన్నారు. 'క్వాడ్ సదస్సు సభ్యదేశాల మధ్య విజన్, అభివృద్ధి, సహకారం, సమస్యల పరిష్కారం గురించి చర్చించే వేదిక. ఇండో-పసిఫిక్ సమస్యలకు పరిష్కారాలు రూపొందించడానికి మేము చురుగ్గా పని చేస్తున్నాం' అని గార్సెట్టి అన్నారు. ఇటీవల జో బైడెన్ నివాసంలో క్వాడ్ సదస్సు నిర్వహించారు. ఇందులోభాగంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భాగస్వామ్య ఆందోళనలు, వ్యూహాలు, కూటమిలో భాగస్వాముల మధ్య సహకారం, భవిష్యత్తులో వేయాల్సిన అడుగులపై సదస్సులో నేతలు సమగ్రంగా చర్చించారు. సముద్రయాన భద్రత, రవాణా వ్యవస్థ, మానవతా సాయాన్ని బలోపేతం చేయడం, విపత్తుల సమయంలో పునరావాస చర్యల్లో సహకరించుకోవడంపైనా చర్చించుకున్నారు.

మా మద్దతు లెబనాన్‌కే: చైనా

బీజింగ్: గాజా యుద్ధంలో కొంత తటస్థంగా ఉన్న బీజింగ్... లెబనాన్ విషయంలో మాత్రం స్పష్టమైన వైఖరి తీసుకొంది. యుద్ధంతో అట్టుడుకుతున్న బీరుట్‌కు చైనా నుంచి మద్దతు లభించింది. ఆ దేశ సార్వభౌమాధికారం, భద్రతను కాపాడుకొనేందుకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ, లెబనాన్ మంత్రి అబ్దుల్లా బవూ హబిబ్ న్యూయార్క్‌లో భేటీ అయ్యారు. బీరుట్‌పై ఇజ్రాయిల్ వాయుసేన దాడులను వాంగ్ యీ ఖండించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై వారు చర్చించుకొన్నట్లు చైనా విదేశాంగశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. పరిస్థితులు ఎంతలా మారినా... బీజింగ్ మాత్రం న్యాయం వైపే బలంగా నిలబడుతుందని పేర్కొంది. లెబనాన్ సహా అరబ్ సోదరులకు చైనా మద్దతు ఉంటుందని ప్రకటించింది. 'లెబనాన్‌లో కమ్యూనికేషన్ పరికరాల పేలుళ్లు సహా ప్రాంతీయంగా జరుగుతున్న పరిణామాలను చైనా జాగ్రత్తగా గమనిస్తోంది. పౌరులపై విచక్షణారహితంగా జరిగిన దాడిని చైనా వ్యతిరేకిస్తోంది' అని వాంగ్‌యీ ఈ భేటీ సందర్భంగా వెల్లడించారు. చైనా పశ్చిమాసియాలో శాంతి కోసం పనిచేస్తోందని వాంగ్ పేర్కొన్నారు. అరబ్ సమాజం, అంతర్జాతీయ మిత్రులతో కలిసి దీనిని కొనసాగిస్తామని వెల్లడించారు. హింసకు హింసతో పరిష్కారం లభించదని అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియా అతిపెద్ద మానవతా సంక్షోభానికి కారణమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ సమాజం స్పష్టమైన వైఖరి అనుసరించాలని, అరబ్ దేశాలు ఏకం కావాలని సూచించారు. ఇప్పటివరకు గాజాకు పరిమితమైన హమాస్-ఇజ్రాయిల్ పోరు... ఇప్పుడు లెబనాన్ వైపునకు విస్తరించింది.

3,736 మద్యం షాపులకు వేలం

(మొదటిపేజీ తరువాయి)
షాపులు కల్లుగీత వృత్తిదారులకు కేటాయించనున్నారు. రిజర్వేషన్ల కోటాలోని షాపులను ఎక్కడెక్కడ కేటాయించాలన్న అంశంపై అబ్కారీశాఖ కసరత్తు చేస్తోంది. కల్లుగీత వృత్తి కులాలకు సంబంధించిన జనాభా ఏయే జిల్లాల్లో ఏ మేరకు ఉన్నారనే అంశంపై అధికారులు ఆరా తీస్తున్నారు. జనాభా ప్రాతిపదికన మద్యం షాపులను ఎక్సైజ్ శాఖ రిజర్వు చేయనుంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలపై విడిగా నోటిఫికేషన్ విడుదల కానుంది. అన్‌రిజర్వుడ్ దుకాణాలకు ప్రతిపాదించే లైసెన్స్ ఫీజులో 50 శాతం మాత్రమే కల్లుగీత వృత్తిదారులు షాపులకు చెల్లించాల్సి ఉంటుంది. మద్యం షాపులకు లైసెన్స్ ఫీజు నాలుగు శ్లాబుల్లో రూ.50 లక్షల నుంచి రూ.85 లక్షల వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

అలాగే గతంలో రాత్రి 9 గంటల వరకే మద్యం షాపులు తెరచి ఉంచగా, ఇకపై ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పనిచేయనున్నాయి. నాణ్యమైన మద్యాన్ని, జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లను అందుబాటులోకి తీసుకొస్తారు. క్వార్టర్ కనీస ధర రూ.99లకే విక్రయించేలా చర్యలు తీసుకోనున్నారు. ముఖ్య నగరాల్లో 12 ప్రీమియర్ దుకాణాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.
వీటికి ఐదేళ్ల కాలపరిమితి నిర్ణయించి లైసెన్స్ ఫీజు కోటి రూపాయలుగా నిర్ణయించారు. కొత్తగా వచ్చే మద్యం షాపులన్నీ రెండేళ్లపాటు కొనసాగేలా లైసెన్స్ ఇస్తారు.

రైతుల ప్రసన్నత కోసం కేంద్రం పాట్లు

(మొదటిపేజీ తరువాయి)
పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా పథకం కింద కవరేజి తగ్గడం, వ్యవసాయోత్పత్తుల దిగుమతుల వల్ల రైతులకు ఆర్థిక నష్టాలు' వంటి నాలుగు అంశాలనే ప్రధానంగా చర్చించామన్నారు.

కొన్ని సూచనలు చేశామని చెప్పారు. మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. శంభు సరిహద్దు వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘాల నేతలు ఎవరూ తాజా చర్చల్లో పాల్గొనలేదని తెలిపారు. చర్చలకు ముందుకు రావాలని ఆందోళన చేస్తున్న రైతు సంఘాలకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంఎస్‌పీ సమస్యకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని ఆకాంక్షించారు.

తమిళనాడులో 11 చోట్ల ఎన్‌ఐఏ దాడులు

చెన్నై: భారతదేశంలో ఇస్లామిక్ పాలనకు కుట్ర పన్నుతున్న హిజ్బ్ ఉత్-తహ్రీర్ అనే ఛాందసవాద సంస్థపై ఎన్‌ఐఏ చర్యలు తీసుకుంది. ఈ సంస్థ ప్రపంచంలోని అనేక దేశాల్లో నిషేధించబడింది. ఈ సంస్థ ప్రస్తుతం భారత్‌లో యువతను తప్పుదారి పట్టించి... దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేలా చేస్తుంది. చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ ఈ సంస్థపై కేసు నమోదు చేసింది. ఇప్పుడు ఈ కేసును ఎన్‌ఐఏకు అప్పగించారు. దీంతో రంగంలోకి దిగిన ఎన్‌ఐఏ తమిళనాడులోని 11 చోట్ల దాడులు నిర్వహించింది. హిజ్బ్ ఉత్ తహ్రీర్ అనే సంస్థ ఆవేశపూరిత ప్రసంగాలు చేస్తూ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుంది. యువతను జీహాద్‌కు సిద్ధం చేయడమే కాకుండా వారికి ఆయుధ శిక్షణ కూడా ఇస్తుంది. జీవ ఆయుధాల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. దీంతోపాటు ఈ సంస్థ మత మార్పిడిలను ప్రోత్సహిస్తుంది. ఆ విధంగా లవ్ జీహాద్ ఘటనల్లోనూ వీరి హస్తం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ ప్రకారం రాయపేటకు చెందిన తండ్రీకొడుకులు, వారి సహచరులు హిజ్బ్-ఉత్-తహ్రీర్‌లో చేరడానికి సిద్ధమైనట్లు వెలుగులోకి వచ్చింది. ఉగ్రవాదానికి సంబంధించిన కేసును క్రైం బ్రాంచ్ ఎన్‌ఐఏకు అప్పగించింది. గతంలో ఇదే కేసులో అరెస్టయిన కొందరు నిందితులను ప్రస్తుతం విచారిస్తున్నారు. విచారణలో కొంత సమాచారం అందుకున్న తర్వాత వెంటనే పుదుకొట్టై, కన్యాకుమారి, తాంబరం సహా 11 ప్రదేశాలలో ఎన్‌ఐఏ చర్యలు ప్రారంభించింది. మధ్యప్రదేశ్‌లో హిజ్బుత్ తహ్రీర్‌తో సంబంధం ఉన్న 16 మందిని అరెస్టు చేశారు. వీరిలో సగం మంది ముస్లింలుగా మారినవారే. ఈ ఛాందసవాద సంస్థ లక్ష్యం ఇస్లామిక్ దేశాన్ని సృష్టించడం. ఈ సంస్థ 1952లో జెరూసలెంలో స్థాపించబడింది. దీని ప్రస్తుత ప్రధాన కార్యాలయం లండన్‌లో ఉంది. దీని నెట్‌వర్క్ యూరప్, దక్షిణాసియాలో ఉంది. నివేదికల ప్రకారం ఈ సంస్థ మూలాలు ఇండోనేషియాలో కూడా ఉన్నాయి.

టెట్ అవస్థలు !

(మొదటిపేజీ తరువాయి)
కొరత ఉండటమే. ఒకే పరీక్షను దఫాలుగా నిర్వహిస్తే..ఎస్జీటీకి చెందిన ఒక రోజులోని మొదటి సెషన్ పేపర్‌లోని ప్రశ్నల సరళి తేలికగా వస్తే...మధ్యాహ్నం సెషన్ లేదా మరుసటి రోజు సెషన్లలోని ప్రశ్నల సరళి కఠినంగా వచ్చే ప్రమాదముంది. దీనివల్ల ప్రతిభగల విద్యార్థులకు నష్టం జరుగుతుంది. అక్టోబరు 3 నుంచి 21వ తేదీ వరకు ఏపీ టెట్ పరీక్షల నిర్వహణకు ఇప్పటికే షెడ్యూలు ఖరారైంది. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పరీక్షలకు సంబంధించి ఒకే సబ్జెక్టుల పరీక్షలను అనేక సార్లుగా నిర్వహించనున్నారు. గతంలో సీబీటీ విధానంలో నిర్వహించిన టెట్ పరీక్షలతో అనేక సమస్యలు ఎదురయ్యాయి. దీనిపై అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయించిన సంఘటనలున్నాయి. గత అనుభవాలను ప్రభుత్వం గుర్తించి జరగబోయే టెట్ అన్ని పరీక్షల ప్రశ్నల స్వరూపం, సరళి ఒకే విధానంతో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

11 సెషన్లుగా ఎస్జీటీ-1(ఏ) పరీక్షలు

ఏపీ టెట్ షెడ్యూలులో భాగంగా ఎస్జీటీ-1(ఏ)కు 11 సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. అక్టోబరు 6వ తేదీన ఉదయం, మధ్యాహ్నం సెషన్లతో ఎస్జీటీ-1(ఏ) పరీక్షలు ప్రారంభమై..10వ తేదీ వరకు రెండు సెషన్లుగా కొనసాగుతాయి. ఆ తర్వాత 13వ తేదీన మొదటి సెషన్‌లో ఎస్జీటీ-1(ఏ) నిర్వహిస్తారు. దీంతో ఒకే ఎస్జీటీ-1(ఏ) ఒక్క విభాగానికే 11 సార్లుగా పరీక్షలు కొనసాగనున్నాయి. దానికి సంబంధించిన ప్రశ్నలను అంశాల వారీగా వందల కొద్దీ ఎంపిక చేయడంతో ఒక్కో ప్రశ్నాపత్రంలో ఒక్కో తరహాగా ప్రశ్నలు ఉంటాయి. దీనివల్ల ఒక పేపర్‌లో ప్రశ్నల సరళి తేలికగాను, మరో పేపరులో కష్టతరంగాను వచ్చే అవకాశముందని కోచింగ్ సంస్థల బోధకులు చెబుతున్నారు. పేపర్-2(ఏ) మేథమేటిక్స్ అండ్ సైన్స్ పరీక్షలను అక్టోబరు 14వ తేదీ మధ్యాహ్నం రెండో సెషన్ నుంచి ప్రారంభమై, 15 నుంచి 17వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు కొనసాగుతాయి. 18వ తేదీ పేపర్-2(ఏ) మొదటి సెషన్‌తో పేపర్-2(ఏ) మేథమేటిక్స్, సైన్స్ పరీక్ష పూర్తవుతుంది. ఈ పేపర్‌కు కూడా ఎనిమిది సెషన్లుగా పరీక్షలను నిర్వహించనున్నారు. 18వ తేదీ మధ్యాహ్నం రెండో సెషన్ నుంచి పేపర్-2(ఏ) సోషల్ స్టడీస్ ప్రారంభమై..21వ తేదీతో పూర్తవుతాయి. పేపర్-2(ఏ) సోషల్ స్టడీస్‌కు ఏడు సెషన్లుగా పరీక్షలు కొనసాగనున్నాయి.

జిల్లాలు దాటి పరీక్షా కేంద్రాలు...

ఏపీ టెట్-2024 పరీక్షా కేంద్రాలను దూర ప్రాంతాల్లో కేటాయించడంతో అభ్యర్థులకు సమస్యలు ఎదుర్కోనున్నారు. హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులంతా తమ పరీక్షా కేంద్రాలను చూసుకుని ఆందోళన చెందుతున్నారు. ఒక అభ్యర్థి తమ అర్హతలకు అనుగుణంగా ఒకటి నుంచి మూడు పరీక్షలకు దరఖాస్తు చేయడం, ఆయా పరీక్షల కేంద్రాలు వేర్వేరుగా ఉండటంతో వారికి దిక్కుతోచడం లేదు. పాఠశాల విద్యాశాఖ కేటాయించిన టోల్ ఫ్రీనంబర్లకు వేలాది మంది ఫోన్లు చేస్తున్నప్పటికీ, సరైన స్పందన లేదని చెబుతున్నారు. ఒకే అభ్యర్థికి వేర్వేరు చోట్ల పరీక్షా కేంద్రాలు లేకుండా చూడాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు అభ్యర్థులు విన్నవిస్తున్నారు. ఏపీ టెట్‌కు 4,27,900 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో దాదాపు 3లక్షల మంది వరకు హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. అత్యధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పేపర్-1(ఏ) భాగంగా 1,82,809మంది పరీక్ష రాయనున్నారు. ఆ తర్వాత మ్యాథ్స్, సైన్స్ విభాగంలో 1,04,788 మంది, సోషల్ స్టడీస్‌లో 70,767, ఎస్జీటీ స్పెషల్‌ఎడ్యుకేషన్ పేపర్-1(బి)కి 2,062 మంది, స్కూల్‌అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పేపర్-2(బి)కి(2438మంది దరఖాస్తు చేశారు. ఇందులో చాలా మంది ఎస్జీటీలతోపాటు బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్), డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యను అభ్యసించిన విద్యార్థులున్నారు. వారిలో మరికొందరు భాషా పండిట్లుగా అదనపు అర్హతలు ఉండటంతో దరఖాస్తు చేశారు. ఏపీ టెట్‌ను పేపర్-1(ఏ), పేపర్-2(బీ)గా..ఉదయం సెషన్‌లో పేపర్-1, మధ్యాహ్నం సెషన్‌లో పేపర్-2 ఉంటుంది. అదే రోజు అదనపు అర్హతలున్న అభ్యర్థులు..ఒక పరీక్షా కేంద్రంలో ఉదయం సెషన్ పరీక్ష రాసిన అభ్యర్థి, మళ్లీ మధ్యాహ్నం సెషన్‌కు పరీక్షకు హాజరయ్యేలా షెడ్యూలతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఉదాహరణకు పశ్చిమ గోదావరిజిల్లాకు చెందిన ఒక ఎస్జీటీ అభ్యర్థికి ఉదయం సెషన్‌లో ఏలూరులో వేస్తే, మధ్యాహ్నం సెషన్‌లో రెండో పరీక్షను రాజమండ్రి, విజయవాడ ఇలా..సమీప సెంటర్లకు మార్చారు. ఏపీ టెట్ దరఖాస్తు సమయంలో అభ్యర్థులు తమ అర్హతల ఆధారంగా ప్రతి పేపర్‌కు రూ.750 చొప్పున ఫీజు చెల్లించారు. అర్హతలున్న అభ్యర్థులు రెండు, మూడు పేపర్లకు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఎస్జీటీ పేపర్-1 పరీక్ష ఉదయం సెషన్‌లో ఉంటే..అదే రోజు మధ్యాహ్నం సెషన్‌లో ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పేపర్-1(బి) అభ్యర్థి రాయాల్సిఉంది. కేవలం గంటల వ్యవధిలోనే పక్కజిల్లాలోని సెంటరుకు హడావుడిగా అభ్యర్థులు వెళ్లాల్సి ఉంది. ఏలూరు, ఎన్టీఆర్‌జిల్లాలకు చెందిన అభ్యర్థులకు రెండు,మూడు జిల్లాలు దాటి పరీక్షా కేంద్రాలు కేటాయించడంతోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇందులో ఉదయం సెషన్ వచ్చిన వారంతా ఒక రోజు ముందుగా సమీప జిల్లాకు చేరుకోవాల్సి ఉంది.ఒకే అభ్యర్థికి ఒకే రోజు వేర్వేరు ప్రాంతాల్లో పరీక్షల షెడ్యూలు లేకుండా చర్యలు తీసుకోవాలని, టెట్ పరీక్షల అన్ని పేపర్లలోనూ ప్రశ్నల సరళి సమానంగా ఉండేలా రూపొందించాలని ప్రభుత్వానికి అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పదవుల జాతర

(మొదటిపేజీ తరువాయి)
ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పీలా గోవింద సత్యనారాయణ, లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పిల్లి మాణిక్యాల రావు, రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలికి పీతల సుజాత, ఏపీ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు తమ్మిరెడ్డి శివశంకర్ (జనసేన), ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు వజ్జా బాబురావు, ఏపీ టౌన్‌షిప్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్‌కు వేములపాటి అజయ్‌కుమార్ (జనసేన) చైర్మన్‌లుగా నియమితులయ్యారు.

బందరులో హైడ్రా తరహా కూల్చివేతలు

(మొదటిపేజీ తరువాయి)
అప్పుడు అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆక్రమణలపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే మడుగు పోరంబోకు భూమిని ఆక్రమించిన ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించకపోవడంతో భారీ బందోబస్తు మధ్య పొక్లెయిన్లతో ఆక్రమణలను అధికారులు తొలగిస్తున్నారు. దీనిపై ఆక్రమణదారులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. అప్పటి ఎమ్మెల్యే పేర్ని నాని చెబితేనే తాము ఇక్కడ గృహాలు నిర్మించుకున్నామని, నేడు అక్రమం అంటూ తొలగించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. కొంతమంది స్వార్థరాజకీయాల కోసం తాము కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

జమ్మూకశ్మీరు రెండో దశ పోలింగ్ నేడు

(మొదటిపేజీ తరువాయి)
ఈద్గా, సెంట్రల్ షాల్టెంగ్, బుద్గాం, బీర్వా, ఖాన్ సాహిబ్, చ్రార్-ఇ-షరీఫ్, చదూరా, గులాబ్‌గఢ్ (ఎస్‌టి) వంటి కీలక స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రెండో దశలో ప్రముఖులు పోటీ చేస్తున్న స్థానాలు కూడా ఉన్నాయి. జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా పోటీ చేస్తున్న రెండు స్థానాలు బుద్గాం, గందర్‌బల్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్ రైనా బరిలో నిలిచిన నౌషెరా స్థానానికి, పీసీసీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా పోటీ చేస్తున్న సెంట్రల్ షాల్ టెంగ్ స్థానానికి బుధవారం పోలింగ్ జరగనుంది.

సిట్ అధిపతిగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి

(మొదటిపేజీ తరువాయి)
మరికొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

నలుగురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

రాష్ట్రంలో నలుగురు ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్‌కు ప్రభుత్వరంగ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు కేటాయించారు. ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్‌ను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్‌గా, ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్ అండ్ ఆర్ కమిషనర్ ఎస్.రామసుందర్ రెడ్డికి పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా, ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఎండీ దినేశ్ కుమార్‌కు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఇలాంటి వ్యక్తి రాజ్యాంగ పదవికా?

(మొదటిపేజీ తరువాయి)
ఒక గవర్నర్‌గా అతను రాజ్యాంగా నికి కట్టుబడి ఉండాలి. భారత రాజ్యాంగం భారతదేశాన్ని లౌకిక ప్రజాస్వామ్య గణతంత్రంగా నిర్వచించింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మతతత్వ భావనను గట్టిగా తిరస్కరించారు. లౌకికవాదం అంటే మతాన్ని నిలబెట్టుకోవడం. రాజకీయాలు వేరు. ఎన్నికల ప్రయోజనాల కోసం దేవుళ్లను తీసుకురావద్దు" అని రాజా గట్టిగా హెచ్చరించారు. ఇలాంటి వ్యక్తిని గవర్నర్‌గా ఎలా నియమించారని మండిపడ్డారు. సీపీఎం నేత బృందా కారత్ మాట్లాడుతూ... 'ఈ గవర్నర్ రాజ్యాంగం సాక్షిగా ప్రమాణం చేశారు...రేపు భారత రాజ్యాంగమే విదేశీ భావన అని చెబుతారు... ఇదే ఆర్ఎస్ఎస్ అవగాహన. తమిళనాడు వంటి కీలక రాష్ట్రానికి అలాంటి వ్యక్తిని గవర్నర్‌గా నియమించడం సిగ్గుచేటు' అన్నారు. ఫెడరలిజం, ఒక వ్యక్తి ఒకే ఓటు, ప్రజాస్వామ్యం అనేవి కూడా యూరప్ నుంచే ఉద్భవించాయనే లాజిక్‌ని గవర్నర్ మరిచారా? అని కాంగ్రెస్ నేత పి. చిదంబరం ప్రశ్నించారు. 'తిరువల్లువర్‌కు కాషాయ వస్త్రాన్ని కప్పిన తమిళనాడు గవర్నర్... ఇప్పుడు లౌకికవాదం యూరోపియన్ భావన అని, భారతదేశంలో దానికి స్థానం లేదని కనుగొన్నారు. అతను సరైనవాడు కాదు. ఆయన సరైనవాడే అయితే... ఫెడరలిజం కూడా యూరోపియన్ భావన. భారతదేశంలో ఫెడరలిజానికి స్థానం లేదని ప్రకటిస్తారా?' అని 'ఎక్స్' పోస్ట్‌లో ఆయన అన్నారు. సెక్యులరిజం అనేది భారతదేశానికి అత్యంత అవసరమైన భావన అని... ఐరోపాది కాదని చెబుతూ... స్నేహంతో కూడిన మతస్వేచ్ఛ కలిగి ఉండాలని ఆర్టికల్ 25 చెబుతోంది. అది ఆయనకు తెలియదు. రాజ్యాంగాన్ని పూర్తిగా చదవాలని డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇలంగోవన్ గవర్నర్ రవికి సూచించారు. తమిళనాడులో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వానికి గవర్నర్ రవికి మధ్య ఇప్పటికే విభేదాలు ఉన్నాయి. తాజాగా ఆయన చేసిన 'లౌకికవాదం' వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి కారణమైంది. "సెక్యులరిజం అనేది యూరప్ భావన, భారతదేశంలో దానికి స్థానం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ దేశ ప్రజలపై చాలా మోసాలు జరిగాయి. వాటిలో ఒకటి లౌకికవాదం. దీనికి తప్పుడు వివరణ ఇవ్వడానికి ప్రయత్నించారు. సెక్యులరిజం అంటే ఏమిటి..? సెక్యులరిజం అనేది యూరోపియన్ భావన. ఇది భారతీయ భావన కాదు" అని కన్యాకుమారిలో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో రవి అన్నారు. 'చర్చి, రాజు మధ్య పోరాటం ఫలితంగా లౌకికవాదం వచ్చింది. భారతదేశం ధర్మానికి ఎలా దూరంగా ఉంటుంది? సెక్యులరిజం అనే యూరోపియన్ భావనని అక్కడే ఉండనివ్వండి. భారతదేశానికి సెక్యులరిజం అవసరం లేదు' అని తమిళనాడు గవర్నర్ అన్నారు. 1976లో 42వ సవరణ ద్వారా భారత రాజ్యాంగ ప్రవేశికలో 'సెక్యులర్' అనే పదాన్ని చేర్చారు.

ఎన్‌ఆర్‌ఐ కోటా అంతా మోసం

(మొదటిపేజీ తరువాయి)
బంధువులు కూడా ఈ కోటా కింద ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రవేశాలు పొందొచ్చని పేర్కొంది. దీనిని పంజాబ్-హర్యానా హైకోర్టు తోసిపుచ్చింది. ఈ నిబంధన దుర్వినియోగానికి దారితీయొచ్చని వ్యాఖ్యానించింది. దీంతో భగవంత్ మాన్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా... అక్కడా అదే పరిస్థితి ఎదురైంది. 'ప్రవేశాల సమయంలో ఎన్‌ఆర్‌ఐ దగ్గరి బంధువును కూడా పరిగణనలోకి తీసుకుంటామని మీరు చెబుతున్నారు. ఇదంతా ఆదాయం పొందే వ్యూహం' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మరో న్యాయమూర్తి జస్టిస్ జేబీ పార్దివాలా కూడా హైకోర్టు తీర్పును సమర్థించారు. 'ఈ ఎన్‌ఆర్‌ఐ కోటా బిజినెస్‌ను మనం ఆపివేయాలి. ఇది పూర్తిగా మోసం. మీరు చెబుతున్న అభ్యర్థితో పోల్చుకుంటే... మూడు రెట్లు ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రవేశం లభించదు. ఆ అభ్యర్థులందరూ భారతీయులే. కానీ వారు కేవలం ఎన్‌ఆర్‌ఐకు బంధువులు' అని సుప్రీం ధర్మాసనం ఈ నిబంధనను తప్పుపట్టింది. చట్టవిరుద్ధమైన వాటిని కోర్టు నిస్సంకోచంగా తోసిపుచ్చుతుందని పేర్కొంది. పంజాబ్‌లోని మెడికల్, డెంటల్ కళాశాలల్లో 185 ఎన్‌ఆర్‌ఐ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

అంతర్జాతీయ కళాశాల ఏర్పాటు అభినందనీయం

ఏపీ బార్ కౌన్సిల్ మెంబరు ముప్పాళ్ల సుబ్బారావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధానిలోని 100ఎకరాల్లో అంతర్జాతీయ న్యాయ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనల పట్ల సీఎం చంద్రబాబుకు ఏపీ బార్ కౌన్సిల్ మెంబరు, భారత న్యాయవాదుల సంఘం గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల సుబ్బారావు రాష్ట్రంలోని న్యాయవాదుల తరపున ధన్యవాదాలు తెలిపారు.
ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, సీఎం చంద్రబాబుకు న్యాయవ్యవస్థ, న్యాయవాదుల సంక్షేమం పట్ల ఉన్న ప్రత్యేక శ్రద్ధకు, నిబద్ధతకు ఈ చర్యలు నిదర్శనమని పేర్కొన్నారు. న్యాయశాఖ సమీక్షలో సీఎం ఆయా అంశాలపై సమీక్షించి, అంతర్జాతీయ న్యాయకళాశాల, కర్నూలులో హైకోర్టు బెంచ్, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10వేల స్టయిఫండ్ ఇచ్చేలా అవసరమైన ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించడం అభినందనీయమని తెలిపారు. ఇటీవల న్యాయ సమీక్షలో సీఎం అనేక అంశాలపై సమీక్షలు నిర్వహించి అంతర్జాతీయ న్యాయకళాశాల, కర్నూల్‌లో హైకోర్ట్ బెంచ్, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10వేల స్టయిఫండ్ ఇచ్చేలా అవసరమైన ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించడాన్ని కొనియాడారు.

త్వరలో వర్సిటీ పోస్టుల భర్తీ

(మొదటిపేజీ తరువాయి)
ఐఐటీలకు ఈ విధానం అమల్లో ఉందని, అదే విధానాన్ని మన రాష్ట్రంలో యూనివర్సిటీల్లో అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పీపీపీ పద్ధతిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ యూనివర్సిటీ అమరాతిలో ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. రాజధాని నవనగరాల్లో భాగంగా అమరావతిలో ఏర్పాటు చేయదలచిన స్పోర్ట్స్ విలేజ్ అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండేలా చూడాలన్నారు. ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకతకు పెద్దపీట వేసేలా వైస్ ఛాన్సలర్ల ఎంపిక ఉండాలని సీఎం స్పష్టం చేశారు. సమీక్షలో మంత్రి నారా లోకేశ్, ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్టీజీ ద్వారా పౌరసేవలు

రియల్ టైమ్ గవర్నెన్స్(ఆర్టీజీ) ద్వారా పౌర సేవలు, ప్రభుత్వ కార్యక్రమాలపై 100 రోజుల్లో ప్రత్యేక ప్రాజెక్టు సిద్ధం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఉన్న సెంటర్‌ను సందర్శించిన ముఖ్యమంత్రి... అనంతరం ఆర్టీజీ సెంటర్‌లోనే సీఎస్, డీజీపీ సహా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. పౌరసేవలను సులభతరం చేయడం, పాలనలో వేగం పెంచడంపై చర్చించారు. ప్రజలకు సంబంధించిన మాస్టర్ డేటాను అన్ని శాఖలు యాక్సిస్ చేసుకొని సత్వర సేవలు అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించారు.

జగన్‌కు డిక్లరేషన్ ఇవ్వాల్సిన బాధ్యత లేదా ?

తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాల్సిన బాధ్యత జగన్‌కు లేదా అని నిలదీస్తూ 'ఎక్స్'లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. నమ్మకం ఉంటే అన్యమతస్థులు సంప్రదాయం ప్రకారం తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాలి. సంప్రదాయాన్ని గౌరవించకపోతే తిరుమల ఎందుకు వెళ్లాలి? మీకు అధికారం ఇచ్చింది సంప్రదాయాలకు విరుద్ధంగా పని చేయడానికి కాదు. అది అడిగితే బూతులు తిట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రథం కాలిపోతే... ఏముందీ తేనెటీగలు వచ్చాయి అన్నారు.

తిరుమల పోటులో అగ్ని ప్రమాదం జరిగితే ఏమవుతుందని వ్యాఖ్యానించారు. ఇలా నిర్లక్ష్యంగా ప్రవర్తించి మనోభావాలు దెబ్బతీశారు. అందుకే భగవంతుడికి అందరం క్షమాపణ చెప్పాలి. ఇక ఆయనే చూసుకుంటాడు. అపచారం చేసి ఆ అబద్ధాలను నిజాలుగా చేయాలని చూడటం స్వామి ద్రోహం" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ల నియామకంపై ఈయూ హర్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ల నారాయణ, స్టేట్ వైస్ చైర్మన్‌గా పీఎస్ మునిరత్నం నియామకంపై ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్‌రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో హర్షం తెలిపారు. కొనకళ్ల అధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేసి... ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా కృషి చేయాలని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వానికి తలనొప్పి

రఘురామ, నానాజీ తీరుపై ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కొందరు ఎమ్మెల్యేలు, నేతల వ్యవహారశైలి చంద్రబాబు ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. వంద రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుని పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయిన వేళ... కూటమికి చెందిన కొందరు ఎమ్మెల్యేలు, నేతల ప్రవర్తన ప్రభుత్వానికి మచ్చతెచ్చేలా మారింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రతిష్ఠ తగ్గించేలా ఉంది. తాజాగా కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వ్యవహారం ఇందుకు నిదర్శనంగా మారింది. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలోని కాళ్ల మండలం ఏలూరుపాడు అంబేద్కర్ విగ్రహం దగ్గర దళిత సంఘాలు ఏర్పాటు చేసిన బ్యానర్‌ను రఘురామకృష్ణంరాజు స్వయంగా తొలగిండం వివాదాస్పదమైంది. అక్కడ బ్యానర్ అడ్డుగా ఉంటే... పోలీసు అధికారులతో చెప్పి తీయించవచ్చు. రఘురామకృష్ణరాజే స్వయంగా రంగంలోకి దిగి బ్యానర్ తొలగించడంతో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనను వైసీపీ నేతలు... రాజకీయంగా తమకు అనువుగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఐదేళ్ల నుంచి రఘురామకృష్ణరాజు మీడియా ప్రచారంలో ముందున్నారు. వైసీపీ ఎంపీగా ఎన్నికై అధిష్ఠానంపై తిరుగుబావుటా ఎగురవేశారు. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీలో చేరి ఉండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జగన్ కేసుల్లో బెయిల్ రద్దు చేయాలని

న్యాయపోరాటం చేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అంబేద్కర్ బ్యానర్‌ను రఘురామకృష్ణరాజు తొలగించడంపై వైసీపీ రాజకీయంగా రాద్ధాంతం చేస్తోంది. దళిత సంఘాలను ఏకం చేసి...కూటమిపై వ్యతిరేకత పెంచడానికి ప్రయత్నిస్తోంది. అంబేద్కర్ బొమ్మతో గల బ్యానర్‌ను రఘురామకృష్ణరాజు తొలగించడాన్ని నిరసిస్తూ... ఆయన ఇంటిముట్టడికి దళిత సంఘాలు పిలుపునిచ్చాయి. పోలీసులు అక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. దళిత సంఘాల ఆందోళన వెనుక కొందరు ఉన్నతాధికారుల హస్తం ఉందని రఘురామకృష్ణరాజు ఆరోపిస్తున్నారు. అక్కడక్కడా రఘురామ దిష్టిబొమ్మ దహనం చేసి... ఆయన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

మరోవైపు, జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ దూకుడు వైఖరి ప్రభుత్వానికి, పవన్ కల్యాణ్‌కు ఇబ్బందికరంగా మారింది. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల మైదానంలో దళిత వైద్యుడిపై నానాజీ దాడికి పాల్పడ్డారు. మెడికల్ కళాశాలలోని వాలీబాల్ కోర్టు వద్ద తమపై జనసేన నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడినట్లు స్పోర్ట్సు వైస్‌చైర్మన్ ఉమా మహేశ్వరరావుకు వైద్య విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని ఆయన రంగరాయ మెడికల్ కళాశాల యాజమాన్యంతోపాటు నేషనల్ మెడికల్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. వాలీబాల్ ఆడుకునేందుకు తమ అనుచరు లకు అనుమతివ్వాలని జనసేన ఎమ్మెల్యే పట్టుపట్టగా... అందుకు మెడికల్ కళాశాల యాజమాన్యం నిరాకరించింది. ఈ సందర్భంగా దళిత డాక్టర్ ఉమామహేశ్వరరావును దుర్భాషలాడారు. అంతటితో ఆగకుండా ఆయనపై పిడిగుద్దులు గుద్దారు. మరోమారు తన అనుచరులను అడ్డుకుంటే అంతు చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. విధుల్లో ఉన్న డాక్టర్ ఉమామహేశ్వరరావుపై నానాజీ చేయిచేసుకున్న సంఘటనపైనా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆయనపై కేసు నమోదు చేసి... పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి. పంతం నానాజీపై చర్యలు తీసుకోవాలని వైద్యులు, వైద్య విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జనసేన నేత, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అరెస్ట్ వ్యవహారంపై జనసేన నేతలు మౌనం వహిస్తున్నారు. జానీ మాస్టర్ వ్యవహారం సైతం జనసేనకు తలనొప్పిగా మారింది. మరోవైపు, చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధ్వర్యంలో బుల్డోజర్‌తో మండల పరిషత్ అధ్యక్షుడి ఇంటిని కూల్చివేయించారు. ఈ ఘటనతో చంద్రబాబు ఆయన్ని ఉండవల్లికి పిలిపించుకుని హెచ్చరించినట్లు ప్రచారం వచ్చింది. టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపైన సైతం లైంగిక వేధింపుల ఫిర్యాదులు వచ్చాయి. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చక్కదిద్దుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. లేకుంటే వైసీపీ ప్రభుత్వానికీ, ఈ ప్రభుత్వానికీ పెద్ద తేడా లేదన్న అభిప్రాయం ప్రజల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది.

గిరిజన సంక్షేమ పథకాలు కొనసాగించాలి

కమిషనర్ కార్యాలయం ఎదుట గిరిజన విద్యార్థి సమాఖ్య నిరసన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దయిన గిరిజన సంక్షేమ పథకాలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ... మంగళవారం విజయవాడ గిరిజన సంక్షేమ కమిషనర్ కార్యాలయం ఎదుట ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) నిరసన తెలిపింది. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.విష్ణునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీంద్రనాయక్ తదితరులు ఆందోళనకు నాయకత్వం వహించారు. ధర్నా అనంతరం గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సదా భార్గవికి నేతలు వినతిపత్రం అందజేశారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమం కుంటుపడిందని, రాష్ట్రవ్యాప్తంగా హాస్టల్ కన్వర్టెడ్ గిరిజన గురుకుల పాఠశాలలకు సొంతభవనాలు లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. గిరిజన గురుకుల పాఠశాలలో పీజీటీ ఉపాధ్యాయుల నియామకం లేకపోవడంతో గిరిజనులకు విద్య దూరమవుతోందని, గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంల కొరతతో విద్యార్థులు అనారోగ్యంతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలలో బోధన, బోధనేతర ఉద్యోగాలు భర్తీ చేయాలని, గిరిజన సంక్షేమ శాఖకు రెగ్యులర్ ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించాలని, నామినేటెడ్ పోస్టుల భర్తీలో గిరిజనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రతి జిల్లాలో స్టడీసర్కిల్ ఏర్పాటు చేయాలని, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, గిరిజన సంక్షేమ గురుకులపాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేయాలని, మద్యం దుకాణల కేటాయింపుల్లో గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. గిరిజన ఆశ్రమ, గురుకుల, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. ఆయా డిమాండ్లపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఆయా సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి పల్లాల రాజకుమార్ రెడ్డి. రాష్ట్ర ఉపాధ్యక్షులు రామరాజు, జాతీయ నాయకులు వెంకటేశ్వర్లు నాయక్, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు జాన్ వెస్లీ, వివిధ జిల్లాల నాయకులు మస్తాన్ నాయక్, కిషోర్ నాయక్, ఏడుకొండల నాయక్, మూడవతురంగరాజు నాయక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధ కమ్యూనిస్టు చౌదరి

సంతాపసభలో రవీంద్రరాథ్

విశాలాంధ్ర-ఒంగోలు: నిబద్ధత గల కమ్యూనిస్టు పీవీఆర్ చౌదరి అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ సెంటర్లో ఒంగోలు నగర ముఠా వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద పీవీఆర్ చౌదరి సంతాపసభ మంగళవారం జరిగింది. సభకు ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌డీ సర్దార్ అధ్యక్షత వహించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఒంగోలులో కార్మిక సంఘాల ఏర్పాటులో చౌదరి కీలక పాత్ర పోషించారన్నారు. ముఠావర్కర్ల కూలి రేట్ల పెంపు కోసం పోరాడారని గుర్తుచేశారు. చౌదరి చనిపోయే ముందు రోజు విజయవాడ వరద బాధితుల కోసం రూ.5 లక్షల విలువైన సరుకులను, దుస్తులను, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారన్నారు. విద్యార్థి, యువజన ఉద్యమాల్లో పాల్గొన్నారని, ఒంగోలు ముఠావర్కర్స్ యూనియన్ భవన నిర్మాణంలో చౌదరి పాత్ర కీలకమన్నారు. గంగిశెట్టి కోటయ్య, జాలయ్య తర్వాత కార్మిక ఉద్యమంలో చౌదరి పాత్ర ముఖ్యమైందని గుర్తుచేశారు. చౌదరి లేని లోటు సీపీఐ, కార్మిక వర్గానికి తీర్చలేనిదన్నారు. ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ చౌదరి గొప్ప ప్రజా నాయకుడన్నారు. పేదల, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారన్నారు. హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అంజిబాబు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ మంచి స్నేహితుడిని కోల్పోయామన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడారు. హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కందుకూరి సుభాన్ నాయుడు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కె.అంజయ్య, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వడ్డపాటి సుబ్బారావు, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు దేసు వెంకటేశ్వర్లు, కార్యదర్శి చెక్క రాధాకృష్ణమూర్తి, కోశాధికారి బియ్యపు వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు ప్రాణాలైనా ఇస్తా

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో అపవిత్రం జరిగితే వైసీపీ నాయకులు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. జగన్ నియమించిన టీటీడీ బోర్డులో తప్పు జరిగిందని ల్యాబ్ రిపోర్టులతో సహా విషయం బయటకు వచ్చినా బుకాయించడం, ఎదురుదాడి చేయడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. తప్పు జరిగినప్పుడు దానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటామని మాట్లాడాలి లేదా అప్పటి బోర్డులో ఉన్న అధికారులు, బోర్డు సభ్యులు ప్రమేయం మీద మాట్లాడాలి గానీ ఇష్టానుసారం మాట్లాడడం సరికాదన్నారు. సనాతన ధర్మానికి భంగం వాటిల్లితే హిందువులంతా కలసికట్టుగా మాట్లాడాలని, మౌనం వహిస్తే...ఆ మౌనం మన భవిష్యత్తు తరాలను నాశనం చేస్తుందని హెచ్చరించారు. ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా పవన్ కల్యాణ్ మంగళవారం విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయం మెట్లను కడిగి శుభ్రం చేశారు. పసుపు రాశారు. కనక దుర్గమ్మవారి దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడారు. గతంలో దుర్గగుడిలో వెండి సింహాలు మాయమైన సందర్భంలోనూ వైసీపీ నాయకులు అవహేళన చేస్తూ మాట్లాడారన్నారు. వైసీపీ పాలనలో వందల ఆలయాలు ధ్వంసం చేశారని, దేవతల విగ్రహాలను అపవిత్రం చేశారని ఆరోపించారు. రామ తీర్థంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేస్తే సంయమనం పాటించాను తప్ప సత్తా ఉన్నా రోడ్డు మీదకు రాలేదన్నారు. దేశంలో సెక్యులరిజం అనేది వన్ వే కాదు. రెండు వైపుల నుంచి ఉండాలన్నారు. ఈ దేశంలో అన్ని మతాలకు సమాన హక్కులున్నాయన్నారు. తాను అన్ని మతాలను సమానంగా గౌరవిస్తానని తెలిపారు. ఇతర మతాల ఆచారాలకు, సంప్రదాయాలకు విఘాతం కలిగితే ఎలా స్పందిస్తున్నారో హిందువుల మనోభావాలకు, ఆచారాలకు, సంప్రదాయాలకు, ధర్మాలకు విఘాతం కలిగినా అంతే స్థాయిలో స్పందించాలన్నారు. సున్నితాంశాలపై నటుడు ప్రకాశ్‌రాజ్ విషయం తెలుసుకుని మాట్లాడాలని, సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. లడ్డూ అపవిత్రం అయిందని తాము మాట్లాడితే మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి మదం ఎక్కిన మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంది కొవ్వు నెయ్యి కన్నా చాలా ఎక్కువ ధర ఉంటుందని దాన్ని సాధారణ నెయ్యిలో ఎలా కలుపుతారంటూ అవహేళన చేసి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైవీ సుబ్బారెడ్డిని విచారణకు రమ్మంటే రికార్డులు పంపమని అడుగుతున్నారన్నారు. ఇంత పెద్ద అపచారం జరిగితే అప్పటి ఈవో ధర్మారెడ్డి అదృశ్యమయ్యారని...ఆయన ఎక్కడున్నారో కూడా తెలియదన్నారు. ఆయన హయాంలో తిరుమలను వ్యాపార, పర్యాటక కేంద్రంగా మార్చారని విమర్శించారు. వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర రెడ్డి కుటుంబ సభ్యులు మతం పుచ్చుకున్నారో లేదో తనకు తెలియదని, హైందవ ధర్మాన్ని కాపాడతామని బాధ్యత తీసుకున్నారు కాబట్టి కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. తప్పులు జరిగినప్పుడు బాధ్యత తీసుకొని ఒప్పుకోవాలన్నారు. సనాతన ధర్మ రక్షణ కోసం తుది వరకు పోరాడుతానని, అవసరమైతే ప్రాణం కూడా ఇవ్వడానికి సిద్ధమని పవన్ చెప్పుకొచ్చారు. తొలుత పవన్ కల్యాణ్‌కు ఆలయ అధికారులు, వేద పండితులు శాస్త్రోక్తంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని శివనాథ్, వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలతో ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వికేంద్రీకరణ విధానంలో ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రైతుసేవా, ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేయాలని స్పష్టంచేసింది. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపింది. సేకరణతో పాటు మిల్లింగ్ ఆపరేషన్లపై పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లు, జేసీలను ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చింది. వ్యవసాయ శాఖ అధ్వర్యంలోని ఈ-పంట, ఈ కేవైసీ ద్వారా రైతులు, కౌలు రైతుల వివరాలను ధాన్యం కొనుగోళ్లకు ఇవ్వాలని సూచించింది. ఆధార్ అనుసంధానంతో ఈ-పంట, ఈ-కేవైసీ ద్వారా రైతుల ఖాతాల్లోకి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపులు చేయాలని ప్రభుత్వం తెలిపింది. ఏపీ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ, ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థలు రాష్ట్రస్థాయి ధాన్యం కొనుగోళ్లకు నోడల్ సంస్థలుగా పనిచేస్తాయని పేర్కొంది. ధాన్యం కొనుగోలు లావాదేవీల్లో ఉన్న రైస్ మిల్లర్లు ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో నమోదు కావాలని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర సాధారణ రకం క్వింటాలుకు రూ.2300, గ్రేడ్-ఏ రకానికి రూ.2320 చెల్లించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు ఉద్వాసన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జెల లక్ష్మికి ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఆమె పదవీకాలం ఆగస్టులోనే ముగియడంతో వెంటనే తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం సంబంధిత శాఖకు ఆదేశాలు ఇస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయగా... విషయం తెలిసిన కొద్దిసేపటికే చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు గజ్జెల లక్ష్మి ప్రకటించారు. చైర్‌పర్సన్‌కు ఉద్వాసన పలకడంతో సభ్యుల పదవీకాలం పూర్తి అయినట్టేనని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ముంబై నటి కాదంబరి జెత్వాని కేసుతో తనకు సంబంధం లేదని గతంలో గజ్జెల లక్ష్మి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఇతర రాష్ట్రాల మహిళల విషయంలో తాము జోక్యం చేసుకోలేమని, ఆమె ముంబైకి చెందిన మహిళ కాబట్టి మహారాష్ట్ర మహిళా కమిషన్‌ను ఆశ్రయించాలంటూ ఉచిత సలహా ఇచ్చారు.

పోలవరం కాలువపై ఆఫ్‌టెక్ నిర్మిస్తేనే

సాగుభూములకు నీరు: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర -గన్నవరం: పోలవరం కాల్వపై 142 కి మీ వద్ద ఓటి (ఆఫ్ టెక్) నిర్మించి సాగుభూములకు నీరు అందించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గన్నవరం మండలంలోని వీరపనేనిగూడెం తెంపల్లి పోలవరం కాలువ పై ఆఫ్‌టెక్ ను తెంపల్లి రైతులతో కలిసి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ గతం లో పోలవరం కాలువ పై ఆఫ్ టెక్‌లను పూర్తి చేయకుండా నిలిపివేసిన ఫలితంగా ... 10 గ్రామాల సాగుభూములకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఆఫ్ టెక్ నుండి సుమారు 6.5 కి.మీ వరకు మేజర్ కాలవ ద్వారా 3,500 వేల ఎకరాలకు నీరు అందించవచ్చని తెలిపారు. అయితే తెంపల్లి రైతులు చెప్పిన వివరాల ప్రకారం కొత్తగూడెం, చిక్కవరం వీరపనేనిగూడెం, మర్లపాలెం, చినఅవుటపల్లి, పొట్టిపాడు, అప్పారావుపేట, ఆత్కూరు, బల్లిపర్రు, తెంపల్లి గ్రామాలకు చెందిన సుమారు 8వేల ఎకరాలకు సాగు, తాగు నీరు అందించవచ్చని తెలిపారు. అదేవిధంగా సబ్ డివిజన్లలో వీరపనేనిగూడెంచ తెంపల్లి, చిక్కవరం ప్రాంతంలోని ఆఫ్ టెక్ నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో నిలిపివేసిన ఆఫ్ టెక్ లను కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి వీరపనేని తెంపల్లి ఆఫ్ టెక్ పూర్తి చేసి 6.5 కి.మీ. మేజర్ కాలువకు భూసేకరణ జరిపి రైతులకు సాగు నీరు అందించాలని ప్రసాద్ కోరారు. అదే విధంగా పోలవరం కాలువ పరిధిలోని ఆఫ్‌టెక్‌లు 40 ఉండగా. అందులో 15 పూర్తి కావాల్సి ఉందని... వాటి ని పూర్తి చేయటానికి సత్వర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గుజరాత్ సీఎంతో మంత్రి జనార్దన్‌రెడ్డి భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గుజరాత్ సీఎం భూపేంద్రభాయ్ పటేల్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గుజరాత్‌లో రెండో రోజు ఉన్నతాధికారుల బృందం పర్యటనలో భాగంగా మంగళవారం అహ్మదాబాద్ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం పటేల్‌ను మంత్రి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గుజరాత్‌లో పబ్లిక్ ప్రవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో రోడ్ల అభివృద్ధి, నిర్మాణం గురించి, గుజరాత్‌లో రాష్ట్ర బృందం సందర్శించిన ప్రాంతాలపై చర్చించారు. రాష్ట్ర బృందం రెండు రోజులుగా చేసిన అధ్యయనంపై సీఎం ఆరా తీశారు. దాదాపు 15నిమిషాలకుపైగా భేటీ కొనసాగింది. గుజరాత్‌లో పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తోన్న 14 రోడ్లు విజయవంతంగా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇప్పటికే ఉన్న 2 లైన్ల రహదారులను 4 లైన్ల రహదారులుగా, 4 లైన్ల రహదారులను, 6 లైన్ల రహదారులుగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. గుజరాత్‌లోని పోర్టులు, ఎయిర్ పోర్టులు, మారిటైమ్ బోర్డు శాఖలను ముఖ్యమంత్రే స్వయంగా చూస్తున్న విషయాన్ని ఆయన తెలియజేశారు. గుజరాత్ మారిటైమ్ బోర్డు అధ్వర్యంలో భారీ, మధ్య తరహా పోర్టులు కలిపి మొత్తంగా 46వరకు నడుస్తున్నట్లు వివరించారు. దేశంలో అత్యధికంగా ఆర్ అండ్ బీ శాఖకు 15శాతం బడ్జెట్ కేటాయింపులు చేసే ఏకైక రాష్ట్రం తమదేనని వివరించారు. ఈ భేటీ అనంతరం అనేక ప్రాంతాలను మంత్రి అధ్వర్యంలోని కమిటీ సందర్శించింది. నర్మదా నది రివర్ ఫ్రంట్, గాంధీనగర్ మెట్రో రైల్‌ను సందర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఉప్పు సత్యాగ్రహం ఉద్యమానికి, మహాత్ముడి పోరాటాలకు కార్యక్షేత్రంగా నిలిచిన సబర్మతి, గాంధీ ఆశ్రమాన్ని తిలకించారు. గుజరాత్ పర్యటన ముగియడంతో మంత్రి అధ్వర్యం లోని ఉన్నతస్థాయి అధికారుల కమిటీ బృందం తిరుగుపయనం కానుంది. ఈ పర్యటనలో మంత్రి జనార్థన్‌రెడ్డితోపాటు ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఏపీఆర్డీసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.



ప్రజాసేవలో కమ్యూనిస్టులు

వరద బాధితులకు బియ్యం, దుప్పట్లు, చీరల పంపిణీ

విశాలాంధ్ర -విజయవాడ(చిట్టినగర్): విజయవాడ వరద ముంపు బాధితులకు కమ్యూనిస్టు పార్టీ అండగా నిలిచిందని, కష్టాల్లో తాము ప్రజలకు తోడుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మంగళవారం అన్నారు. కృష్ణహోటల్ సెంటర్, సీపీఐ కార్యాలయం వద్ద నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరరావు అధ్వర్యంలో 800 మంది ముంపు బాధితులకు బియ్యం, చీరలు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఈశ్వరయ్య మాట్లాడారు. వరదలు, భారీవర్షాలతో బుడమేరు ప్రాంత గ్రామాలు నీటమునిగాయన్నారు. రెండు లక్షల 70 వేల కుటుంబాలు నీట మునిగిపోవడంతో ప్రజలకు ఆహారం, తాగునీరు అందించామన్నారు. విజయవాడలోని సింగ్‌నగర్ ప్రాంతంలో ఇళ్లల్లోకి నీరు వచ్చి మూడు రోజుల పాటు ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఆ సమయంలో సీపీఐ నేతలు శంకర్, భాస్కర్‌రావు ప్రజలకు అండగా నిలిచారన్నారు. పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి అరుణ్ కుమార్ సహకారంతో, వివిధ ప్రాంతాల నుండి ఇతర దాతల సాయంతో బియ్యం, నిత్యావసర సరుకులు సేకరించి బాధితులను ఆదుకున్నామని చెప్పారు. బుడమేరు ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థలో కమ్యూనిస్టులు లేని లోటు కనబడుతుందన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ తమ కష్టాలకన్నా ప్రజల కష్టాలే ముఖ్యమనే రీతిలో భాస్కరరావు కుటుంబం ముంపు బాధితులకు సేవలందించటం అభినందనీయమన్నారు. అనేక ప్రాంతాలలో 15 రోజులపాటు అన్నదానం చేసి బాధితులకు అండగా నిలిచారని కొనియాడారు. కాగా వరద బాధితుల సహాయార్థం చిరంజీవులు యశ్విన్, యశ్విక 10 వేల రూపాయల చొప్పున ఈశ్వరయ్య, శంకర్‌కు విరాళం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గాయకులు ఎస్‌కే నజీర్, డి.సూరిబాబు, కాళ్ల చిన్నప్ప, భాషా అభ్యుదయ గేయాలు ఆలపించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శులు నక్క వీరభద్రరావు, లంకా దుర్గారావు, కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడయ్య, కొట్టు రమణారావు, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, అధ్యక్షులు కంచర్ల భార్గవ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్, 58వ డివిజన్ కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి గురునాథం, కోశాధికారి గురవయ్య, సభ్యులు టి.బ్రహ్మాజీరావు, నాగరాజు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్యను ప్రైవేటుపరం చేయొద్దు

జాన్సన్‌బాబు డిమాండ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు విమర్శించారు. స్థానిక అమర్‌భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయనగరంలో ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు నవంబర్ 27 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమాజంలో అసమానతలు, అన్యాయాలు, దోపిడీని ఎదిరించడంతోపాటు సామాజిక రుగ్మతలపై ఏఐఎస్ఎఫ్ పోరాడిందని గుర్తుచేశారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. మహాకవి గురజాడ, శ్రీశ్రీ, నారాయణ బాబు, చాసో వంటి సాహితీవేత్తలకు నిలయమైన విజయనగరంలో మహాసభలు నిర్వహించాలని నిర్ణయించడం సంతోషంగా ఉందన్నారు. నవంబర్ 27న విద్యార్థుల ప్రదర్శన, బహిరంగసభ ఉంటుందని, ఏఐఎస్ఎఫ్ జాతీయ నాయకులు హాజరవుతారని జాన్సన్‌బాబు వివరించారు. జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం మాట్లాడుతూ విద్యా వ్యతిరేక విధానాలపైన పోరాటం చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీ శంకర్, పట్టణ నాయకులు రాము, భార్గవ్, కిరణ్, భరత్, శంకర్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీ కోసం 4న ఆందోళనలు: శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉచిత ఇసుక హామీని తక్షణమే చంద్రబాబు కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, అక్టోబర్ 4న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడం, రేట్లు పెరిగిపోవడం, విచ్చలవిడి అవినీతి వల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడిందన్నారు. అనేక కారణాలతో పాటు ఇసుక సమస్యపై ఆగ్రహంతో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించారని, ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. వందరోజుల పాలనలో చూస్తే ఇసుక విషయంలో గత ప్రభుత్వానికీ, ఈ ప్రభుత్వానికి తేడా లేకుండా పోయిందని పేర్కొన్నారు. అనేకచోట్ల ఇసుక లభించడం లేదని, రవాణా చార్జీలు, ఇతర పేర్లు చెప్పి ఇసుక రేట్లు తగ్గించలేదన్నారు. కొన్నిచోట్ల మరింత పెరిగాయని, ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నదని, ప్రజాప్రతినిధులు,అధికార పార్టీ నేతలు చాలా చోట్ల ఇసుకపై పెత్తనం చేస్తున్నారని వివరించారు. ఇసుక కొరత, అధిక ధరలతో భవన నిర్మాణరంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కొరవడుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా ఇసుక లభించేలా తగిన చర్యలు తీసుకో వాలని, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలని, భవన నిర్మాణాలు చేసుకునే వారిపై అధిక భారం లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ, అక్టోబర్ 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, దీక్షలు ప్రదర్శనల రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

యూట్యూబ్ చానళ్లనూ కొనేస్తున్న అదానీ

ఇప్పటికే మీడియా - పత్రికలు, ఎలక్ట్రానిక్ మాధ్యమాల మీద అంబానీ, అదానీ ఉడుంపట్టు కొనసాగుతోంది. నిజానికి ప్రధాన మైంది అనుకుంటున్న మీడియా మోదీ ప్రభుత్వానికి స్వచ్ఛందంగా ఊడిగంచేసే పనిలో తలమునకలై ఉంది. అనేకమంది అనుభవ జ్ఞులైన పత్రికలు గుత్త పెట్టుబడిదార్ల గుప్పెట్లో ఉన్న పత్రికలలో ఇమడలేక యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా మోదీ విద్వేష ప్రచారాన్ని ఎదుర్కోవడానికి పాటు పడుతున్నారు. ఇలాంటి వేదికలు వాస్తవం తెలుసుకోవాలనుకునే వారికి ప్రధాన ఆధారాలుగా మారాయి. అవి గుప్పెడే కావచ్చు కానీ లక్షలాది సంఖ్యలో వీక్షకుల అభిమానం సంపాదిస్తున్నాయి. వీటిని కూడా వీలైతే స్వాధీనం చేసుకుని లేకపోతే ఒత్తిడిచేసో, ప్రభావితం చేసో తమ అధీనంలోకి తెచ్చుకోవాలని అదానీ ప్రయత్నిస్తున్నారు. ఆ ఒత్తిడికి తాజాగా సంజయ్ శర్మ నడిపే 4 పి.ఎం. యూట్యూబ్ చానల్ లొంగి పోయింది. సంజయ్ శర్మ సాధారణంగా ప్రజాస్వామ్య పరిరక్షణకోసం పాటుపడే సమాచారాన్నే అందించేవారు. అయితే ఆయన యూట్యూబ్ చానల్ లో జ్యోతిషం లాంటి వాటికీ ముఖ్యమైన స్థానమే ఉంది. కానీ 4 పి.ఎం. చానల్ లో జోస్యం చెప్పేవారు కూడా సంజయ్ శర్మలో విపరీతమైన మార్పు వస్తుందని పసిగట్టలేక పోయారు. ఇటీవల సంజయ్ శర్మ అదానీ పాట పాడడం మొదలు పెట్టారు. లక్నో నుంచి సంజయ్ శర్మ ఈ యూట్యూబ్ చానల్ నడుపుతుంటారు. ఆయన చానల్‌కు దాదాపు 60 లక్షల మంది చందాదారులు (సబ్ స్క్రైబర్లు) ఉన్నారు. 4 పి.ఎం. చానల్ ఈ స్థితికి రావడానికి మోదీ విద్వేషాన్ని ఎండగట్టే అజిత్ అంజుం, అశోక్ వాంఖడే లాంటి వారు తోడ్పడ్డారు. ఇటీవల అశోక్ వాంఖడే ఆ చానల్ కార్యక్రమాల్లో ఇక మీదట పాల్గొనకూడదని నిర్ణయించుకున్నారు. దీనితో సంజయ్ శర్మ యూట్యూబ్ చానల్ అసలు కథ బయట పడింది. ఇటీవల సంజయ్ శర్మ అదానీని వేనోళ్ల పొగుడుతూ ఒక వీడియో విడుదల చేశారు. దానితో అశోక్ వాంఖడే లాంటి వారు ఆ చానల్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ పరిణామంతో సంజయ్ శర్మ ఇంతవరకు వ్యవహరించిన తీరు కూడా డొల్లేనా అన్న ప్రశ్న తలెత్తక మానదు. ఇటీవల సంజయ్ శర్మ రూపొందించిన వీడియోలో అదానీపై ఏదైనా కుట్ర జరుగుతోందేమో అన్న అనుమానాలు వ్యక్తం చేశారు. లేక భారత్ స్టాక్‌మార్కెట్‌ను కుప్ప కూల్చే కుట్రలు జరుగుతున్నాయా అన్న అనుమానం వ్యక్తం చేశారు. 2020వ సంవత్సరంలో అదానీ కంపెనీకి చెందిన ఒక్కో వాటా (షేర్) ధర 200 రూపాయలు ఉండేది. అప్పుడు అదానీ కంపెనీ లాభం వెయ్యి కోట్ల రూపాయలు ఉండేది. 2022కల్లా ఒక్కో షేర్ ధర పదిరెట్లు పెరిగింది. కానీ లాభం రూ. 768 కోట్లకు పడిపోయింది. వాటాల ధరలు పెరిగి లాభాలు తరగడంలో ఏదో మతలబు ఉండే ఉండాలి. హిండెన్ బర్గ్ అదానీకి వ్యతిరేకంగా కుట్ర చేస్తోంది అన్న అనుమానం కూడా సంజయ్ శర్మ వ్యక్తం చేశారు. కానీ భారత షేర్ మార్కెట్‌ను అనుకూలంగానో, ప్రతికూలంగానో ప్రభావితంచేసే శక్తి హిండెన్ బర్గ్‌కు లేదు. ఉన్నా అది తాత్కాలికమే. ఒకవేళ అదే సాధ్యం అయితే హిండెన్ బర్గ్, టాటా, ఆదిత్య బిర్లా, అంబానీ కంపెనీలకు వ్యతిరేకంగా ఎందుకు సమాచారం వెల్లడించలేదు అన్న ప్రశ్న హేతుబద్ధంగా ఆలోచించే వారి మదిలో మెదలక తప్పదు. కానీ అలా జరగలేదు. హిండెన్ బర్గ్, టాటా, ఆదిత్య బిర్లా, అంబానీ కంపెనీలకు సంబంధించిన సమాచారం వెల్లడించలేదు. లొసుగులు ఉన్న అదానీ లాంటి కంపెనీల మీదే హిండెన్ బర్గ్ దృష్టి పెడుతుంది. అదానీ కంపెనీల్లో లొసుగులు ఉన్నందువల్లే ఆ కంపెనీ వాటాలు ఒక్కసారిగా రూ. 4,000 నుంచి రూ.1,000కి పడిపోయాయి. అదానీ కంపెనీ షేర్ల ధర అమాంతం పెరిగిపోవడానికి మౌలికమైన పునాది లేకపోవడమే ప్రధాన కారణం. స్విస్ బ్యాంకులో అదానీ దాచుకున్న దొంగ సొత్తు గురించి హిండెన్ బర్గ్ సమాచారం విడుదల చేసినా స్టాక్ మార్కెట్‌లో అదానీ షేర్ల ధరలు కుప్పకూలలేదు. అందువల్ల పులిలా విజృంభించిన హిండెన్ బర్గ్ చిట్టెలుకలా తోక ముడుచుకోవాల్సి వచ్చిందని సంజయ్ శర్మ వ్యాఖ్యానించారు. ప్రతి సమాచారానికి మార్కెట్ స్పందించక పోవచ్చు అన్న వాస్తవాన్ని ఆయన పరిగణనలోకి తీసుకోకుండా అదానీని నిష్కళంకుడిగా చిత్రించడానికి తాపత్రయ పడ్డారు. హిండెన్ బర్గ్ పరిశోధనలకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉంది. హిండెన్ బర్గ్ తక్కువ ధరకు షేర్లు కొని లాభాలు సంపాదించుకునే సంస్థ అన్న మాట నిజమే కానీ ఒక్క అదానీ కంపెనీలలోని లొసుగులనే ఎందుకు బయటపెడ్తోంది అన్న ప్రశ్న వేసుకోకుండా సంజయ్ శర్మ అదానీని వెనకేసుకు రావడానికి తంటాలు పడుతున్నారు. అంటే ఆయన అదానీకి అమ్ముడు పోయాడు అనుకోవాల్సిందే.

సంజయ్ శర్మ 4 పి.ఎం. చానల్ కొన్నాళ్లు మూత పడింది. మళ్లీ కోలుకుంది. సంజయ్ శర్మను ప్రేక్షకులు భయంలేని వ్యక్తి అనుకున్నారు. ప్రభుత్వాన్ని నిలదీయగల దమ్మున్న మనిషి అనుకున్నారు. కానీ ఆయన ఒక్కసారిగా కుప్పిగంతు వేశారు. అదానీ మీద భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. దీని వెనక ఏదో కారణం ఉండే ఉంటుంది. సంజయ్ శర్మ నడిపే యూట్యూబ్ చానల్ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్న ప్రచారం జరుగుతోంది. సబ్ స్క్రైబర్ల లెక్కన చూస్తే రవీశ్ కుమార్ చానల్‌కు కోటి మందికి సబ్ స్క్రైబర్లు ఉన్నారు. తార్కికంగా అది అగ్రశ్రేణిది కావాలిగా. కానీ ఫోర్ పి.ఎం. చానల్‌కు వీక్షకులు ఎక్కువగా ఉన్నారంటున్నారు. నిజేమే అనుకున్నా సంజయ్ శర్మ ఒకే కార్యక్రమాన్ని పేరు మార్చి మళ్లీ మళ్లీ అప్‌లోడ్ చేస్తుంటారు. ఇది వీక్షకుల సంఖ్యను పెంచే చిట్కా సంజయ్ శర్మ ఆడుతున్న ఆటలను ఆయనతో పాటు పని చేస్తున్న పత్రికా రచయితలూ పసిగట్టారు. అఖిల్ స్వామీ 4 పి.ఎం.కార్యక్రమాల్లో పాల్గొనేవారు. కానీ ఆయన ఈ కథంతా గమనించిన తరవాత మానేశారు. అశోక్ వాంఖడేదీ అదే పరిస్థితి. వాంఖడే నిరంతరం అదానీ నాటకాల గుట్టు విప్పుతుంటారు. మోదీ అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడ్తుంటారు. కానీ ఆ తరవాత 4 పి.ఎం.కు సంబంధించిన ఓ వ్యక్తి మీరు ఫోర్ పి.ఎం.లోనే కాకుండా మరే చానల్ లోనూ అదానీకి వ్యతిరేకంగా మాట్లాడకూడదు అనడంతో వాంఖడే ఆ చానల్‌కు దూరమయ్యారు. 4 పి.ఎంలో గుజరాత్ నుంచి పనిచేసే మయూర్ జానీ కూడా సంజయ్ శర్మ అమ్ముడు పోయాడంటున్నారు. అదానీని సమర్థిస్తూ గత 16వ తేదీన సంజయ్ శర్మ జారీ చేసిన వీడియోను జాగ్రత్తగా పరిశీలిస్తే ఆయన అదానీకి అమ్ముడు పోయారని రుజువు అవుతోందని మయూర్ జానీ అంటున్నారు. 4 పి.ఎం. చానల్ ను అదానీ కొనేసి ఉండకపోవచ్చు. నిర్వాహకుడిని మాత్రం కొనేశారు.



బర్ధన్ రచనలు స్ఫూర్తిదాయకం

ఎం.లక్ష్మీరాజ్యం

సమసమాజ స్థాపన, కార్మిక, అట్టడుగు వర్గాల శ్రేయస్సే లక్ష్యంగా సుదీర్ఘ కాలం పోరాడిన యోధుడు ఏబీ బర్ధన్ రచనలు స్ఫూర్తిదాయకమైనవి. ముఖ్యంగా ట్రేడ్ యూనియన్ ఉద్యమం, కమ్యూనిస్టు ఉద్యమంపై ఆయన రాసిన చిరుపుస్తకాలు, వ్యాసాలు కమ్యూనిస్టు శ్రేణులకు విజ్ఞానదాయకంగా నిలుస్తాయి. మతం, కులం, చరిత్రపై ఆయన వెలువరించిన పుస్తకాలు ఆయా అంశాలను అర్థంచేసుకోవడానికి, అవగాహన పెంచుకోవడానికి మార్గదర్శనం చేస్తాయి. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రోగ్రామ్ రూపకల్పన చేసింది ఆయనే. స్వాతంత్ర్యోద్యమంలో, కార్మికోద్యమంలో, జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించటంతో పాటు ఆ మూడింటికీ వారధిగా ఉన్న చిట్టచివరి నేత బర్ధన్ అని చెప్పవచ్చు. వామపక్ష ఉద్యమం చవిచూసిన ఎత్తుపల్లాలకు ఆయన ప్రత్యక్ష సాక్షి. నిర్మొహమాటంగా మాట్లాడేతత్వం, నమ్మిన సిద్ధాంతాల పట్ల నిబద్ధత బర్ధన్‌ను రాజకీయాలకతీతంగా అందరికీ సన్నిహితుడిని చేసింది. అప్పటివరకూ కమ్యూనిస్టుల కంచుకోటగా ఉన్న పశ్చిమబెంగాల్లో 2011లో తృణమూల్ కాంగ్రెస్ చేతిలో లెఫ్ట్ ఫ్రంట్ ఓడిపోయినపుడు "మీరు మారండి... లేదంటే మీ పని అయిపోయినట్టే"నని కమ్యూనిస్టు నేతలను హెచ్చరించారు. 1996లో ప్రధానమంత్రి పదవిని కమ్యూనిస్టులు అంగీకరించకపోవటం చారిత్రక తప్పిదమన్న మార్క్సిస్టు నేత జ్యోతిబసు మాట వాస్తవమని బర్ధన్ నొక్కిచెప్పారు. 'కమ్యూనిస్టు రాజకీయాలు భిన్నమైనవని దేశ ప్రజలకు చూపించటానికి వచ్చిన అవకాశం అది. అది కోల్పోయిన అవకాశం. పెట్టుబడిదారీ వ్యవస్థ పరిమితులలోనైనా సరే ఆ ప్రయత్నం చేసి తీరాల్సింది' అని బర్ధన్ అన్నారు. ఆయన ఆత్మకథ గురించి విలేకరులు ప్రశ్నించినపుడు 'ఆత్మకథ స్వీయ అభినందనకు, పరులను నిందించటానికి ఉద్దేశించింది. నేను రాయను' అని కుండబద్దలుకొట్టారు. సిద్ధాంతాలు, నియమాలకు పూర్తిగా అంకితమైన ఒక నిఖార్సైన కమ్యూనిస్టు నేతగా బర్ధన్ ఎప్పటికీ గుర్తుండిపోతారు.

విశాలాంధ్రతో అనుబంధం

బర్ధన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాలాంధ్ర దినపత్రిక అంటే ప్రత్యేక అభిమానం. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీతో ఆయనకు సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయి. విద్యార్థి దశ నుంచే ఆంధ్రప్రదేశ్‌తో బర్ధన్‌కు గాఢమైన సంబంధాలు కొనసాగాయి. 1946లో గుంటూరులో జరిగిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ మహాసభల విజయవంతంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ప్రతి ఎన్నికల సందర్భాలలోనూ, రాష్ట్ర మహాసభలలో, ఇతరత్రా అనేక సార్లు రాష్ట్రానికి విచ్చేసి కార్యక్రమాలలో పాల్గొని పార్టీ శ్రేణులకు స్ఫూర్తిమంతంగా నిలిచారు. విశాలాంధ్ర దినపత్రికతో కూడా బర్ధన్‌కు సాన్నిహిత్యం ఉంది. పార్టీ కార్యక్రమాల కోసం విజయవాడకు వచ్చినప్పుడల్లా విశాలాంధ్ర కార్యాలయాన్ని సందర్శించేవారు. విశాలాంధ్ర విశాఖ ఎడిషన్ ఆయన చేతుల మీదగానే ప్రారంభమైంది. విజయవాడ, హైదరాబాద్‌లో జరిగిన విశాలాంధ్ర వార్షికోత్సవ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. హైదరాబాద్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌ను కూడా బర్ధనే ప్రారంభించారు. కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌తో కూడా ఆయనకు ఎనలేని సంబంధముంది, సీఆర్ ఫౌండేషన్ శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు బర్ధన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. భూపోరాటయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేత అమరజీవి చంద్ర రాజేశ్వరరావు విగ్రహాన్ని 2008 అక్టోబరు 8న సీఆర్ ఫౌండేషన్‌లో బర్ధన్ ఆవిష్కరించారు.

కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన అవిరళ కృషి ఎనలేనిది. బర్ధన్ జీవితం అంతా కమ్యూనిస్టు పార్టీకే అంకితం. నిస్వార్థ సేవ, రాజకీయ సభ్యతకు బర్ధన్ చిహ్నం. వామపక్ష కార్మికోద్యమాలతో బర్ధన్ జీవితం మమేకమైంది. చెప్పిన మాటను ఆచరించి చూపించే వారు. దోపిడీరహిత సమాజాన్ని నిర్మించాలన్న ఆయన కలలను సాకారం చేసేందుకు కృషి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి. ఆయన జీవితం మహోన్నత ప్రేరణ. కమ్యూనిస్టు నాయకునిగా ఆయన సేవలు నిరుపమానం. ఉత్తమమైన, ఉన్నతమైన మానవ జీవితాన్ని ఎలా జీవించాలో ఆయన జీవిత చరిత్రన మనకు తెలుపుతోంది. సీటు కోసమో, ఓటు కోసమో, పదవి కోసమో, పైసాకోసమో మాటను, బాటనూ మార్చుకునే నేటి రాజకీయ విన్యాసాల వేళలో అంకిత భావం, నిబద్ధమైన ఆశయ ప్రస్థానంగల బర్ధన్ జీవిత స్మరణ కారు చీకట్లో కాంతి రేఖలా కనపడుతుంది. శత జయంతి సందర్భంగా ఆయనకిదే మన ఘన నివాళి.

ఈ తరం దార్శనికుడు బర్ధన్

ఎం. మురళీకృష్ణ

బహుముఖ ప్రజ్ఞాశాలి, కార్మికవర్గ నేత, సంక్షుభిత, సంకీర్ణ రాజకీయాల శకంలో సీపీఐ ప్రధాన కార్యదర్శిగా పార్టీని సమర్థవంతంగా నడిపిన అగ్రశ్రేణి నాయకుడు అర్ధేందు భూషణ్ బర్ధన్ (ఏబీ బర్ధన్). బుధవారం ఆయన శతజయంతి. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు రాజకీయాల వైపు ఆకర్షితులైన బర్ధన్ తర్వాత కార్మికోద్యమాల్లో రాటుతేలారు. భారత కమ్యూనిస్టు పార్టీకి పాతిక సంవత్సరాలు మార్గనిర్దేశనం చేశారు. నాగపూర్ కేంద్రంగా నాటి మధ్యప్రదేశ్‌లో, ఆ తర్వాత మహారాష్ట్రలో ఏఐటీయూసీ నిర్మాణంలో తనదైన ముద్రవేశారు. విదర్భ ప్రాంతంలో కష్టజీవులు, మధ్యతరగతి వర్గాల ప్రేమాభిమానాలు చూరగొన్న ప్రజానాయకుడు ఆయన. ఏ సమస్యకైనా వాస్తవికత ఆధారంగా పరిష్కారం చూపడంలో ఆయనకాయనే సాటి. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఏక పార్టీ పాలనా విధానం నుంచి సంకీర్ణ రాజకీయాల వైపునకు అంతర్లీనంగా పరుగులు పెడుతున్న పరిణామాన్ని ముందుగానే పసికట్టిన చైతన్యశీలి. వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయానికి కమ్యూనిస్టు ఐక్యతకు స్థిర సంకల్పంతో కృషిచేశారు. దేశానికి మతోన్మాద ముప్పు ఎదురుకానుందని ఏనాడో హెచ్చరించిన వివేచనాశీలి. దేశంలో చీలికలు పేలికలైన కమ్యూనిస్టు శ్రేణుల ఐక్యత అవసరాన్ని గుర్తించి వామపక్షాలన్నింటినీ ఒకే వేదిక మీదకు తెచ్చేందుకు శత విధాల ప్రయత్నించి కొంత మేరకు విజయం సాధించారు. పార్టీకి ఓ కార్యక్రమం ఉండాలని భావించిన ఆయన దాన్ని రూపుదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. పుదుచ్చేరిలో జరిగిన పార్టీ జాతీయ మహాసభ ఆయనను ప్రోగ్రామ్ కమిషన్ శాశ్వత చైర్మన్‌గా ఎన్నుకుంది. మతోన్మాదశక్తులను నిలవరించేందుకు లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు, పార్టీలతో ఓ అవగాహన కల్పించుకొని వామపక్షాలు ఐక్య పోరాటం చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించి కృషిచేశారు.

20 సార్లు అరెస్టు, నాలుగేళ్ల జైలు... రెండేళ్ల అజ్ఞాతవాసం

బర్ధన్ తూర్పు బెంగాల్ (ప్రస్తుతం బంగ్లాదేశ్) లోని బరిసాల్లో 1924 సెప్టెంబరు 25న జన్మించారు. ఆయన తండ్రి ఉన్నత ఉద్యోగి. ఆయన కుటుంబం నాగపూర్‌లో స్థిరపడింది. బర్ధన్ ప్రతిభావంతుడైన విద్యార్థి. నాగపూర్ యూనివర్సిటీలో ఎంఏ పట్టాపొందారు. ఆర్థికశాస్త్రం, న్యాయశాస్త్రాలలో పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలను కూడా పొందారు. 15వ యేట నుంచే కమ్యూనిస్టు భావాలను కలిగి ఉండేవారు. 1940లో నాగపూర్ విశ్వవిద్యాలయంలోని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)లో చేరారు. అప్పటికే నిషేధంలో ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీలోనూ అదే సంవత్సరం బర్ధన్ చేరారు. విద్యార్థి దశలోనే జైలుకు వెళ్లి, అక్కడ నుంచే పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులయ్యారు. నాగపూర్ వర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికలలో అత్యంత మెజారిటీతో పీసీ శుక్లాపై గెలుపొందారు. 1946లో గుంటూరులో జరిగిన ఏఐఎస్ఎఫ్ జాతీయ మహాసభలలో ఆయన కీలక పాత్ర పోషించారు. పంజాబ్ టెర్రరిస్టుల సింహస్వప్నం సత్యపాల్ డాంగ్, చట్టసభల్లో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్ల బిల్లు రూపకర్త గీతాముఖర్జీ సహచరుడిగా బర్ధన్ విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించారు. 1948 నుంచి రెండు సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపారు. తన రాజకీయ జీవితంలో వివిధ ఉద్యమాలు నిర్వహించి 20 సార్లు అరెస్టయ్యారు. నాలుగేళ్లకు పైగా జైలు జీవితం గడిపారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి, 1957లో మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో నాగపూర్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. 1969, 1980 సాధారణ ఎన్నికల్లో నాగపూర్ నుంచి లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయారు.

1990లో దేశ రాజకీయాల్లో ప్రవేశించి, సీపీఐ ఉప ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కాలంలో బర్ధన్ కేంద్ర కార్యదర్శివర్గంలోకి వచ్చారు. ఆ తర్వాత ఇంద్రజిత్ గుప్తా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనప్పుడు ఉప ప్రధాన కార్యదర్శిగా బర్ధన్ బాధ్యతలు చేపట్టారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో సీపీఐ చేరడంలో బర్ధన్ కీలక పాత్ర పోషించారు. అప్పటివరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఇంద్రజిత్ గుప్తా కేంద్ర హోంమంత్రి కావడంతో, బర్ధన్ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. 2012 మార్చి వరకూ ఆయన ఆ పదవిలోనే కొనసాగారు. కొత్త వారికి నాయకత్వ బాధ్యతలు అప్పగించాలన్న సంకల్పంతో ప్రధాన కార్యదర్శి పదవి నుంచి బర్ధన్ స్వచ్ఛందంగా తప్పుకున్నారు. ఆ తర్వాత పార్టీ శ్రేణులకు ఆయన తన విలువైన సూచనలిస్తూ వచ్చారు. కాంగ్రెస్, బీజేపీయేతర పక్షాలను థర్డ్ ఫ్రంట్ పేరుతో ఒక్క తాటిపైకి తీసుకురావడంలో బర్ధన్ విశేషంగా కృషి చేశారు.

దేశ రాజకీయాల్లో వామపక్షాలను ఐక్యవేదిక మీదకు తీసుకురావడంలో, ప్రత్యామ్నాయ పంథా రూపకల్పనలో ఆయన మార్గదర్శకత్వం వహించారు. కమ్యూనిస్టు పార్టీల ఆహ్వానంపై అనేక సోషలిస్టు దేశాలతో పాటు చైనా, వియత్నాంలో విస్తృతంగా పర్యటించారు. బంగ్లాదేశ్, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆయనతో అనేకసార్లు సమావేశమై వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించేవారు. దక్షిణాఫ్రికా, లాటిన్ అమెరికా కమ్యూనిస్టు పార్టీ నాయకులతో బర్ధన్‌కు మంచి సంబంధాలున్నాయి.

జనాన్ని ఆకట్టుకునే వక్త

భారతీయ సమాజానికి వర్గం, కులం రెండు పార్శ్వాలు, ఆర్థిక దోపిడీ, కుల పీడన లేని సోషలిస్టు సమాజ ఆవిష్కరణకు కంకణం కట్టుకున్న సీపీఐకి విప్లవ పంథాను రూపకల్పన చేసిన వ్యూహకర్త ఆయన. ఆయనలో ఓ చక్కని రచయిత, జనాన్ని ఆకట్టుకునే వక్త కనిపిస్తాడు. సమస్యలను దీటుగా ఎదుర్కొనగలిగే నేత బర్ధన్‌లో మనకు కనిపిస్తారు. వివిధ భాషల్లో ఆయన కున్న పాండిత్యంతో మంచి వక్తగా రాణించడంతో పాటు వ్యక్తిత్వాన్నీ మెరుగులు దిద్దుకోగలిగారు. మార్క్సిజం-లెనినిజం మౌలిక రచనలు, రవీంద్రనాథ్ ఠాగూర్, శరత్ సాహిత్యం, విక్టర్ హ్యూగో, షేక్స్పియర్, షొలొఖోవ్ రష్యన్ క్లాసిక్స్, మరాఠీ, బెంగాలీ, హిందీ, ఇంగ్లీషు భాషలతో లోతైన పరిచయం, కళలు, సాంస్కృతిక రంగాల్లో అనుబంధం ఆయనను ఒక విశిష్ట మేధావిగా తీర్చిదిద్దాయి. నిరాడంబరత, నిక్కచ్చిదనం, నిర్మాణ దక్షతలో బర్ధన్ తనదైన ముద్రవేశారు.

కార్మికుల సమైక్యతకు ఎనలేని కృషి

నాగపూర్ కేంద్రంగా కార్మిక సంఘాల నిర్మాణం, వాటిని సంఘటితపర్చడంలో ఆయన కృషి ఎనలేది. ఏఐటీయూసీకి అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ముఖ్యంగా అఖిల భారత స్థాయిలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్‌కు దీర్ఘకాలం అధ్యక్షుడిగా పనిచేశారు. మహారాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమంలో ముఖ్యంగా విదర్భ ప్రాంతంలో కామ్రేడ్ సుధాం దేశ్‌ముఖ్‌తో కలిసి బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించారు. నాగపూర్‌లో అందరి ప్రేమాభిమానాలు చూరగొన్న మేధావిగా, రాజకీయ నాయకుడుగా ఆయన రాణించారు. విదర్భలోని అనేక సంస్థలు ఆయనకు పురస్కారాలు అందజేశాయి. కార్మిక శ్రేణులతో మమేకమై పనిచేశారు. కార్మిక, శ్రామిక హృదయాల్లో చెరగని ముద్ర వేసుకోవడం వల్లనే బర్ధన్ 80వ పడిలో అడుగిడినప్పుడు విదర్భకు చెందిన ట్రేడ్‌యూనియన్ సంస్థలన్నీ కలిసి ఆయనను సత్కరించి రూ.20లక్షల మొత్తాన్ని అందించాయి. ఆ మొత్తాన్ని ఆయన వెంటనే విదర్భ ట్రేడ్ యూనియన్ స్కూలుకు విరాళంగా అంద జేశారు. ఆయన తన సర్వస్వాన్నీ పార్టీకే అంకితం చేశారు. పార్టీ కోసమే జీవించారు. ఆఖరి రెండు దశాబ్దాలు సీపీఐ ప్రధాన కార్యాలయం అజయ్ భవన్‌లోనే ఆయన నిరాడంబర జీవితం గడిపారు. 92వ ఏట 2016 జనవరి 3న దిల్లీలో ఆయన కన్నుమూశారు.

విజ్ఞానఖని సచ్చిదానందమూర్తి

ఆచార్య కాళంగి రెమి రజని

తెలుగునాట నడయాడి, విశ్వవిఖ్యాతి చెందిన తత్వవేత్తలలో జీవన సూత్రాలకు వైదిక వెలుగు అద్దిన ఆపస్తంబుడు, మహాయాన బౌద్ధ దార్శనికుడు నాగార్జునుడు, బౌద్ధ తార్కికుడు దిఙ్నాగునికి దీటుగా ఆధునిక కాలంలో సర్వేపల్లి రాధాకృష్ణన్, జిడ్డు కృష్ణమూర్తి తర్వాత పేరెన్నికగన్న తత్వవేత్త ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి. సెప్టెంబరు 25న ఆయన శత జయంతి కార్యక్రమాలు యావత్తు దేశం నిర్వహించుకోవడం మూర్తీభవించిన జ్ఞానసంపదకు దివ్యాంజలి ఘటించటమే! ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి 1924 సెప్టెంబరు 25న గుంటూరు జిల్లా తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. అతి సహజంగా అమరిన జ్ఞాన జిజ్ఞాసకు స్వయంకృషితో, తాత్విక విశ్లేషణకు పట్టంకట్టి తత్వశాస్త్ర మేధావుల పరిశీలనకు మాత్రమే పరిమితమైనది కాదని, సామాన్య మానవుల ప్రగతి సాధనకు మార్గదర్శకాలు నిర్దేశించే శాస్త్రమని ఉద్బోధించిన మేటి తాత్వికుడు ఆచార్య కె.ఎస్.మూర్తి.

ఆనంద హిందూ వాఙ్మయం బ్రహ్మ స్వభావాన్ని 'సచ్చిదానంద' (సత్=సత్యం, చిత్=అనంతమైన స్పృహ, నిత్య నూతన ఆనందం) అని అభివర్ణిస్తుంది. సచ్చిదానందమూర్తి పుట్టుకతోనే ప్రతిభావంతుడు సృజనాత్మక శక్తి, క్రియాశీలం కలిగిన వ్యక్తి అని సర్ సి.ఆర్.రెడ్డి కొనియాడారు. భగవద్గీత బోధించిన సనాతన ధర్మానికి ఆయువు పట్టు అయిన సమానత్వం, ఏకత్వం మూర్తీభవించిన 'సమదృష్టి' ప్రపంచ మానవ కోటి అలవర్చుకోవాలన్నది ఆచార్య సచ్చిదానందమూర్తి ఉద్బోధన. ప్రాథమిక విద్యను స్వగ్రామంలోనూ, ఇంటర్మీడియట్ గుంటూరు ఏసి కళాశాలలోనూ పూర్తిచేసి 1946వ సంవత్సరంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి తత్వశాస్త్రంలో ఆనర్స్ డిగ్రీ పట్టాను అందుకున్నారు. 1949లో ఏయూలోనే తత్వశాస్త్ర అధ్యాపకులుగా చేరి 1954 నుంచి 1975 వరకూ తత్వశాస్త్ర విభాగాధిపతిగా సేవలందించారు. 1975లో తిరుపతి-శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. 1984-89 మధ్య యు.జి.సి. ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. మరోవైపు తత్వశాస్త్రంలో వివిధ పరిశోధనలు జరిపారు. పురాణ, ఇతిహాసాలను ఔపోసి నిత్య శోధకుడిగా మారిపోయారు. బౌద్ధశాస్త్రంపై వివిధ గ్రంథాలు రాశారు. సచ్చిదానందమూర్తి జ్ఞానాన్వేషణ గుర్తించిన బెనారస్ హిందూ యూనివర్శిటీ (1980), ఆంధ్ర(1982), ఆచార్య నాగార్జున (1983), జెఎన్టీయు, శ్రీ వెంకటేశ్వర, శ్రీ కృష్ణదేవరాయ తదితర భారతీయ విశ్వవిద్యాలయాలతోపాటు మాస్కోలోని రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, బల్గేరియాలోని సోఫియా యూనివర్శిటీ, బీజింగ్‌లోని పీపుల్స్ యూనివర్శిటీ ఆఫ్ చైనా, జర్మనీలోని హాలివిట్టెవేబర్ యూనివర్శిటీలు గౌరవ డాక్టరేట్లు ఇచ్చి సత్కరించాయి. భారత ప్రభుత్వం ఇచ్చే దేశంలో రెండవ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ (2001)తో పాటు అనేక అవార్డులు ఆచార్య మూర్తిని వరించాయి. 14 ఏళ్ల వయసులోనే శ్రీ సంగమేశ్వర అష్టకం అనే గ్రంథం మొదలు 14 గ్రంథాలను తన 30 ఏళ్ల వయసులోనే రచించారు. తన జీవిత కాలంలో 35 తాత్విక గ్రంథాలను తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలలో రచించిన త్రిభాషాకోవిదుడు, ప్రపంచతత్వాల పండితుడు ఆచార్య మూర్తి. 1949లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర అధ్యాపకునిగా అడుగులువేసిన ఆచార్య మూర్తి, దేశవిదేశాలలో అత్యుత్తమ యూనివర్శిటీలైన కేంబ్రిడ్జ్, ప్రిన్స్‌టన్, ఆక్స్‌ఫర్డ్‌ల్లో ప్రసంగ వక్త స్థాయికి ఎదిగారు. తన పరిశోధన, రచన, ప్రసంగాల పయనంలో భాగంగా అమెరికా, ఆస్ట్రేలియా, ఆసియా, యూరప్ దేశాల్లో ప్రత్యేక ఆహ్వానాలపై పర్యటించారు. అనేక తత్వశాస్త్ర సభలకు అధ్యక్షులుగా, వివిధ 'వర్శిటీలకు ఉపకులపతిలుగా, విజిటింగ్ ప్రొఫెసర్‌గా, పరిశోధనా పర్యవేక్షుడిగా వ్యవహరించారు.

విద్య, తత్వశాస్త్ర రంగాల సేవలకు గుర్తుగా గుంటూరులోని ఆచార్య నాగార్జున వర్శిటీ, సచ్చినందమూర్తి పేరిట 'సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో-ఏషియన్ ఫిలాసఫీ' కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2007లో భారత తత్వశాస్త్ర శాఖ రజతోత్సవం సందర్భంగా జీవిత సాఫల్య పురస్కారంతో ఆయనకు సత్కరించాయి. 1938-2002 కాలం మధ్య 64 సంవత్సరాలపాటు బహుగ్రంథ రచయితగా, నిరంతర తత్వసాధన సేవలో, రాగద్వేషాలకు, కలిమి లేములకు, వత్తిడి సంతోషాలకు అతీతంగా భగవద్గీత ఉద్బోధించిన స్థితప్రజ్ఞుడైన దార్శనికునికి విద్యార్థిగా, శిష్యురాలిగా ఆయన అభిమానం చూరగొనటం భగవంతుడిచ్చిన గొప్పవరంగా భావిస్తూ ఆచార్య మూర్తి శతాబ్ది జయంతి కార్యక్రమంలో భాగస్వాములు కావడం మా(ఈ) తరంకు ఒక పుణ్యఫలమని చెప్పవచ్చు. 86 ఏళ్ల వయసులో 2011 జనవరి 25వ తేదీన పరమపదించిన ఆయన ఆశయాలు ఆచరణ, తాత్విక ఆలోచనలు అనుసరణే... ఆచార్య సచ్చిదానందమూర్తికు ఈ తరం ఇచ్చే ఘనమైన నివాళిలవుతాయి.

వైస్-ఛాన్సలర్, డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం.

పుల్వామా దాడి నిందితుడు గుండెపోటుతో మృతి

శ్రీనగర్: ఐదేళ్ల క్రితం జరిగిన పుల్వామా దాడికి సంబంధించి నాడు సీఆర్పీఎఫ్ జవాన్ల మరణానికి కారణమైన నిందితుల్లో ఒకరు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... పుల్వామాలో సీఆర్పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌పై ఉగ్రదాడి జరిగిన ఘటనలో 18 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. వీరిలో జమ్మూకశ్మీర్‌లోని కాకాపోరాకు చెందిన బిలాల్ అహ్మద్ కుచేయ్ కూడా ఒకడు. జవాన్ల మృతికి సంబంధించిన కేసులో బిలాల్ ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. తీవ్ర అనారోగ్యం కారణంగా సెప్టెంబరు 17న అతడిని అధికారులు జమ్మూకశ్మీర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో అతనికి గుండెపోటు రాగా... చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని అధికారులు తాజాగా వెల్లడించారు.

ఎన్నికల్లో డబ్బు వినియోగంపై ఉక్కుపాదం: ఈసీ

రాంచీ: ఎన్నికలప్పుడు డబ్బు ప్రవాహాన్ని కట్టడి చేసేందుకు కఠినంగా వ్యవహరించాలని కేంద్ర-రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలకు ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ధన బలంపై ఉక్కుపాదం మోపాలని సూచించింది. ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, డాక్టర్ ఎస్ఎస్ సంధుతో పాటు రాజకీయ పార్టీలు, భద్రతా దళాలు, ఇతర భాగస్వాములతో సీఈసీ రాజీవ్ కుమార్ సమావేశమయ్యారు. ఎన్నికల ఏర్పాట్లు సమీక్షించారు. డీఆర్ఐ, ఎన్‌సీబీ, జీఎస్టీ, ఆర్పీఎఫ్, ఆర్బీఐ, పోలీసులు, ఐటీ, ఈడీ వంటి 20 కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగాలని ఆదేశాలిచ్చారు. ఎన్నికల వేళ తనిఖీల పేరిట పౌరులు ఎవరినీ వేధింపులకు గురిచేయొద్దని అధికారులకు సీఈసీ స్పష్టంచేశారు. సమన్వయంతో పనిచేయాలని, అక్రమంగా డబ్బు, మద్యం, మాదకద్రవ్యాల ప్రవాహాన్ని కట్టడి చేయాలని, రూట్‌మ్యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలకు ఈసీ సూచించింది. మదకద్రవ్యాలు, మద్యం స్మగ్లర్లపై నిఘా పెట్టాలని పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించింది. అంతర్రాష్ట్ర సరిహద్దుల సమీక్షలు, పోలీసు నాకా ఏర్పాటు వంటివి విస్తృతంగా జరగాలని పేర్కొంది. బెంగాల్, ఒడిశా, బీహార్‌తో జార్ఖండ్ పంచుకునే సరిహద్దులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులకు ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్లు ప్రకటన తెలిపింది.

డిప్యూటీ సీఎంగా ఉదయనిధి స్టాలిన్ సంకేతాలు

చెన్నై: తమిళనాడు క్రీడాశాఖమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు పదోన్నతి లభించబోతున్నది. త్వరలోనే ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ విషయాన్ని సీఎం ఎంకే స్టాలిన్ మంగళవారం సూచనప్రాయంగా వెల్లడించారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ, ఉదయనిధికి డిప్యూటీ సీఎం పదవిపై విలేకరుల అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. నిరాశ పడాల్సిన అవసరం లేదని, మార్పు ఉంటుందన్నారు. ఈశాన్య రుతుపవనాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించినట్లు తెలిపారు. అమెరికా పర్యటనలో వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై స్పందిస్తూ... పరిశ్రమల మంత్రి టీఆర్‌బీ రాజా ప్రకటన విడుదల చేశారని గుర్తు చేశారు. అదొక శ్వేతపత్రమేనన్నారు. స్టాలిన్ అమెరికా పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 18 కంపెనీలతో రూ.7,616 కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు అమెరికా పర్యటనకు వెళ్లిన స్టాలిన్ రెండుసార్లు కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై స్పందించారు. ప్రభుత్వంలో ఉదయనిధి స్టాలిన్‌కు పెద్దపీట వేస్తారని పార్టీలో జోరుగా చర్చ సాగుతున్నది. ఇటీవల ఉదయనిధికి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చే విషయంలో స్టాలిన్ నిర్ణయం తీసుకుంటారని మంత్రి అన్బరసన్ తెలిపారు. తాజాగా సీఎం స్టాలిన్ వ్యాఖ్యలతో ఉదయనిధికి డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టడం ఖాయమని తెలుస్తున్నది. ప్రస్తుతం ఉదయనిధి యువజన సంక్షేమం, క్రీడల మంత్రిగా కొనసాగుతున్నారు. డీఎంకేలో యూత్ విభాగానికి కార్యదర్శిగా ఉన్నారు.

సిద్ధరామయ్యకు ఎదురు దెబ్బ

'ముడా' వ్యవహారంలో గవర్నర్ నిర్ణయాన్ని హైకోర్టు సమర్థన

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీఎం కుటుంబానికి మంగళూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) స్థలం కేటాయింపు వ్యవహారంపై గవర్నర్ విచారణకు ఆదేశించడాన్ని హైకోర్టు సమర్థించింది. స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అధికారం గవర్నర్‌కు ఉందని తెలిపింది. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను కర్నాటక హైకోర్టు తోసిపుచ్చింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విచారణ చేసేందుకు అనుమతి ఇచ్చింది. సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతమ్మ పేరిట మైసూరు ప్రాంతంలో ఉన్న భూములను గతంలో అభివృద్ధి పనుల కోసం ముడా సేకరించింది. పరిహారంగా ఆమెకు మైసూరు-విజయనగరంలో ఖరీదైన స్థలాలు కేటాయించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మౌఖిక ఆదేశాలతోనే ముడా అధికారులు ఆమెకు ఖరీదైన ప్రాంతంలో విలువైన స్థలాలు కట్టబెట్టారని ప్రతిపక్ష బీజేపీ జేడీఎస్ ఆరోపించాయి. ఇవే ఆరోపణలతో ముగ్గురు సామాజిక కార్యకర్తలు ఎస్పీ ప్రదీప్‌కుమార్, టీజే అబ్రహం, స్నేహమయి కృష్ణ గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో ఎందుకు విచారణకు ఆదేశించకూడదో తెలపాలని తొలుత సీఎంకు షోకాజ్ నోటీసులు ఇచ్చిన గవర్నర్... ఆ తర్వాత సిద్ధరామయ్యపై విచారణకు అనుమతి మంజూరు చేశారు. గవర్నర్ ఆదేశాలపై సిద్ధరామయ్య హైకోర్టులో పిటిషన్ వేయగా, విచారణ జరిపే వరకు ఆయనపై ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవద్దని ట్రయల్ కోర్టును హైకోర్టు ఆదేశించింది. విచారణ పూర్తిచేసిన కర్నాటక హైకోర్టు... గవర్నర్ చర్యను సమర్థిస్తూ... సీఎంపై విచారణకు అనుమతించింది. అయితే ఈ తీర్పు సిద్ధరామయ్య భవిష్యత్తుకు ఎంతో కీలకమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

'ఇది బీజేపీ, జేడీఎస్ ప్రతీకార రాజకీయం: సిద్ధరామయ్య

ముడా కేసులో దర్యాప్తు ఎదుర్కోవడానికి తాను వెనుకాడనని సిద్ధరామయ్య చెప్పారు. అయితే, అలాంటి దర్యాప్తునకు చట్టప్రకారం అనుమతి ఉందో లేదో అనే విషయంలో నిపుణులను సంప్రదిస్తానని తెలిపారు. "ఈ కేసుపై, న్యాయ నిపుణులతో సంప్రదించి, తర్వాతి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాను. రాబోయే కొద్ది రోజుల్లో నిజం బయటకు వస్తుంది. సెక్షన్ 17ఏ కింద దర్యాప్తు రద్దు అవుతుందని నేను ఆశిస్తున్నాను. ఈ రాజకీయ పోరాటంలో రాష్ట్ర ప్రజలు నా వెనుక ఉన్నారు. వారి ఆశీర్వాదాలే నాకు రక్ష. నేను చట్టాన్ని, రాజ్యాంగాన్ని నమ్ముతున్నాను. ఈ పోరాటంలో చివరకు గెలిచేది న్యాయమే. నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ చేసే ఈ ప్రతీకార, వేధింపు రాజకీయాలకు వ్యతిరేకంగానే ఈ పోరాటం చేస్తున్నా. బీజేపీ, జేడీయూ ప్రతీకార రాజకీయాలకు వ్యతిరేకంగా మా న్యాయపోరాటం కొనసాగుతుంది. పార్టీ అధిష్ఠానం, నేతలు, కార్యకర్తలంతా ఈ న్యాయపోరాటంలో నాకు మద్దతుగా ఉన్నారు. నేను పేదల పక్షపాతిని, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నందుకే విపక్షాలు నాపై రాజకీయ ప్రతీకారానికి పాల్పడుతున్నాయి" అని సిద్ధరామయ్య మండిపడ్డారు.

సీఎం వెంటనే రాజీనామా చేయాలి: బీజేపీ డిమాండ్

ముడా స్కామ్‌లో విచారణ స్వేచ్ఛగా, స్వతంత్రంగా జరిగేందుకు ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయాలని బీజేపీ మంగళవారం డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. అవినీతికి పాల్పడడమే ధ్యేయంగా మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, . సిద్ధరామయ్య సీఎం అయ్యాక ప్రజాధనాన్ని దోచుకున్న సందర్భాలు చాలా ఉన్నాయని ఆరోపించారు. ప్రస్తుతం కర్నాటకలో ఏదో ఒక భూ కుంభకోణంలో పాల్గొనని కాంగ్రెస్ నాయకుడు ఒక్కరు కూడా లేరని రాజీవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దళితులకు సంబంధించిన భూమిని సిద్ధరామయ్య భార్యకు కేటాయించారని, ఆయని సీఎం పదవిని దుర్వినియోగం చేశారని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ఆరోపించారు. ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నిజాయతీపరుడిగా నమ్మితే

ఒక్క అవకాశమివ్వండి

హర్యానా ప్రజలకు కేజ్రీవాల్ పిలుపు

చండీగఢ్: నాకు ఒక అవకాశం ఇవ్వండి అని హర్యానా ప్రజలకు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. కేజ్రీవాల్ నిజాయతీపరుడని నమ్మితేనే ఓటేయండని పిలుపునిచ్చారు. ప్రజలు ఇచ్చే నిజాయితీ సర్టిఫికేట్టే తనను గెలిపిస్తుందని, అది దక్కినప్పుడే తిరిగి ముఖ్యమంత్రి అవుతానని చెప్పారు. అక్టోబరు 5న జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు. 'పదవిని విడిచిపెట్టి మీ ఓట్ల కోసమే వచ్చా. ఈరోజుల్లో ప్యూను ఉద్యోగాన్ని కూడా వదిలిపెట్టరు. నేను ముఖ్యమంత్రి పదవిని వదిలేశాను. నా రాజీనామాను ఎవరూ కోరలేదు' అని కేజ్రీవాల్ అన్నారు. 'హర్యానాలో ఒక్క అవకాశమివ్వండి, ఢిల్లీ, పంజాబ్‌లో తరహాలో ఉచిత విద్యుత్ కల్పిస్తాం. స్కూళ్లు నిర్మిస్తాం. నాణ్యతతో కూడిన విద్యను అందిస్తాం' అని హామీనిచ్చారు. 'ఇవన్నీ ఎలా చేస్తారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా అని మీరు అడగవచ్చు. ఇందుకు నా సమాధానం ఒక్కటే... మేము లేకుండా ఏ ప్రభుత్వం ఏర్పాటు కాలేదు' అని కేజ్రీవాల్ అన్నారు. తన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని, దొంగగా ముద్ర వేయాలని బీజేపీ యతిస్తోందని, తన నిజాయతీని తనకు బద్ధశత్రువులుగా ఉన్నవారు సైతం నమ్ముతారని అన్నారు. అవినీతిపరుడినే అయితే ఢిల్లీలో ఉచిత విద్యుత్, విద్య, వైద్యం సాధ్యమా అని ప్రశ్నించారు. హర్యానాలో ఉచిత విద్యుత్ అందిస్తున్నారా? విద్యుత్ ఏ రాష్ట్రంలోనైనా ఖరీదుగా ఉంటుంది. ఉచితంగా విద్యుత్ ఇచ్చిన నేను దొంగనా లేక దాని ఖరీదు పెంచిన వారా? వరుస ప్రశ్నలు సంధించారు. సిర్సాలోని రానియా అసెంబ్లీ నియోజకవర్గంలో ఆప్ అధ్వర్యంలో అభ్యర్థి హర్పిందర్ సింగ్ తరపున ప్రచారం కోసం చేపట్టిన రోడ్‌షోలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. అకారణంగా ఐదున్నర నెలలు ఖైదులో ఉంచి నిజాయతీపరుడిగా ఉన్న నా చరిత్రను కళంకితం చేసేందుకే బీజేపీ కుట్ర చేసిందని విమర్శించారు. జైల్లో ఉండగా మానసికంగా, శారీరకంగా కుంగిపోయేలా చేసేందుకు యత్నించారని, మధుమేహంతో బాధపడుతున్న తనకు కనీసం మందులు ఇవ్వలేదని చెప్పారు. నన్ను వాళ్లు ఏం చేయాలని అనుకున్నారో అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

హర్యానా యువతకు 'డంకీ' కష్టాలెందుకు?

రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: హర్యానా యువతకు 'డంకీ' కష్టాలు ఎందుకని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. (డంకీ అంటే డాంకీ ఫ్లైట్ల ద్వారా అక్రమంగా విదేశాలకు వెళ్లడం). వృద్ధాప్యంలో తోడునీడగా ఉండాల్సిన పిల్లలు తమ తల్లిదండ్రులకు దూరంగా విదేశాల్లో ముప్పతిప్పలు పడుతున్నారని, ఉద్యోగావకాశాలు లేక ఈ దుస్థితి అని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. 'పెట్టుకున్న నమ్మకం వమ్ముకావడానికి తోడు మనస్సు తల్లడిల్లిపోవడంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో వేదన భరిత ప్రయాణాన్ని (డంకీ) యువత ఎంచుకుంటున్నారు. ఈ వలసపక్షులను తమ గూటికి దూరం చేయకుండా, సొంత దేశంలోనే ఉపాధి అవకాశం కల్పిస్తే, కుటుంబాలతో కలిసివుంటూ. స్వదేశాన్ని ఎప్పటికీ వీడవు' అని రాహుల్ గాంధీ నొక్కిచెప్పారు. ఇదే కాంగ్రెస్ సంకల్పమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హర్యానా యువత తమ కుటుంబాలకు దూరం కాకుండా స్వదేశంలోనే ఉపాధి అకాశాలు పొందేందుకు పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు చేస్తుందని రాహుల్ హామీనిచ్చారు.ఉద్యోగావకాశాలను హరించడం వల్ల విదేశాలకు వెళ్లాలని భావించి అతికష్టమైన 'డంకీ' మార్గాన్ని ఎంచుకొని యువకులు వేదనను అనుభవిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ వ్యాపింపజేసిన నిరుద్యోగమనే రోగానికి లక్షల కుటుంబాలు మూల్యం చెల్లిస్తున్నాయని 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు. 'ఇటీవల అమెరికాకు వెళ్లినప్పుడు అక్కడ హర్యానాకు చెందిన కొందరు యువతకులను కలిసిన వీడియోను పంచుకున్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ విదేశీ గడ్డపై అష్టకష్టాలు పడుతున్నట్లు వారు తనతో చెప్పినట్లు తెలిపారు. దేశానికి తిరిగి వచ్చిన రాహుల్ ఆ కుటుంబాలను కలిస్తే, వారంతా భావోద్వేగానికి లోను కావడం ఆ వీడియోలో ఉంది.

కాంగ్రెస్‌తోనే ఉజ్వల భవిష్యత్: ప్రియాంక

హర్యానా యువకు ఉజ్వల భవిష్యత్‌కు కాంగ్రెస్ హామీనిస్తోందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. యువకుల ఆశలు, ఆకాంక్షలు హరించి వారిలో నైరాశ్యాన్ని బీజేపీ నింపిందని విమర్శి ంచారు. రాష్ట్రంలో మొత్తం 4.5లక్షల ప్రభుత్వ ఉద్యోగాల్లో నుంచి 1.8 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయ న్నారు. యువత జీవితాల్లో వెలుగులు నింపేది కాంగ్రెస్సే అని ప్రియాంక 'ఎక్స్'లో పేర్కొన్నారు. నిరుద్యోగాన్ని ఓ రుగ్మతగా బీజేపీ మార్చిందని, లక్షల మంది జీవితాలను ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వలసలకు చెక్ పెడుతుందని, కుటుంబాలకు రక్షణ కల్పిస్తుందని, యువతతో నైరాశ్యాన్ని తుడిచి పెట్టి వారిని ప్రగతి పథంలో నడిపిస్తుందని ప్రియాంక హామీనిచ్చారు.

కేరళ నటుడు సిద్ధిఖీ అరెస్ట్‌కు రంగం సిద్ధం



తిరువనంతపురం: నటిపై అత్యాచారం కేసులో కేరళ నటుడు సిద్దిఖీని అరెస్ట్ చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్‌ను కేరళ హైకోర్టు తిరస్కరించింది. ప్రస్తుతం ఆయన ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి వీలుగా లుకౌట్ నోటీసు జారీ అయింది. 2016లో తిరువనంతపురంలోని ప్రభుత్వ హోటల్‌లో సిద్దిఖీ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఓ నటి ఇటీవల ఫిర్యాదు చేశారు. తొలుత ఈ ఘటనపై ఫిర్యాదు చేయకూడదని ఆ నటి భావించారు. గత నెల జస్టిస్ హేమ కమిటీ నివేదిక సమర్పించడంతో ధైర్యంగా ముందుకొచ్చారు. మలయాళం సినీ పరిశ్రమలో మహిళలపై వ్యవస్థీకృత వేధింపులను ఈ నివేదికలో ప్రస్తావించారు. మాజీ నటీమణులు తమ చేదు అనుభవాలు పంచుకోవాలని ప్రోత్సహించారు. దీంతో తనకు తమిళ చిత్రంలో పాత్ర ఇప్పిస్తానని, అందుకు ప్రతిగా కోర్కెలు తీర్చాలని సిద్దిఖీ డిమాండ్ చేశారని ఆ నటి ఆరోపించారు. అందుకు తాను నిరాకరించగా... అతడు అత్యాచారానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల సిద్దిఖీ ఎంపికయ్యాడు. లైంగిక ఆరోపణలు తెరపైకి రావడంతో రాజీనామా చేశాడు.

ఉన్నావ్ బాధితురాలి ఆమోదం అవసరం

భద్రతపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఉన్నావ్ అత్యాచార బాధితురాలికి, ఆమె కుటుంబసభ్యులకు ఇచ్చిన సీఆర్పీఎఫ్ భద్రతను ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్నట్లు కేంద్రం ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఈ పిటిషన్‌పై బాధితురాలు, ఆమె కుటుంబసభ్యులు స్పందించాలని జస్టిస్ బీఎం త్రివేది, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం కోరింది. బాధితురాలి ఆమోదం లేకుండా భద్రత తొలగించడం సరికాదని స్పష్టంచేసింది. కేంద్ర తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ప్రస్తుతం బాధితురాలికి ఎటువంటి బెదిరింపులు రావడం లేదని, కాబట్టి ఆమెకు భద్రత అవసరం లేదని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ సుప్రీం ఆదేశాల మేరకు ఘటన అనంతరం విచారణతో సహా అన్నింటినీ ఢిల్లీకి బదిలీ చేశామన్నారు. ప్రస్తుతం బాధితురాలు నివాసముంటున్న ప్రదేశంపై ధర్మాసనం ప్రశ్నించగా... ఢిల్లీలోనే ఉంటున్నట్లు పేర్కొన్నారు. 2017లో ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌కు చెందిన బాలికపై కుల్దీప్ సింగ్ సెంగార్ అత్యాచారానికి పాల్పడిన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. ఈ ఘటనలో కుల్దీప్ సింగ్‌తో పాటు మరో ఆరుగురిని దోషులుగా తేలుస్తూ ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. 2018లో ఓ కేసులో బాధితురాలి తండ్రి అరెస్ట్ కాగా, ఆయన కస్టడీలో మరణించాడు. ఉన్నావ్ బాధితురాలు సహా ఆమె కుటుంబసభ్యులు కారులో వెళుతుండగా వారిపై హత్యాయత్నం జరిగింది. ఈ ఘటనలో బాధితురాలు కుటుంబ సభ్యులను సైతం కోల్పోయింది. ప్రస్తుతం ఆమె సీఆర్పీఎఫ్ సంరక్షణలో ఉంది.

కీచక ప్రిన్సిపల్ అరెస్టు

గుజరాత్‌లో చిన్నారిపై అత్యాచారయత్నం: హత్య

దహోద్: అభంశుభం తెలియని బాల్యాన్ని తుంచేశాడో ఓ కీలక ప్రిన్సిపల్. స్కూలుకు తీసుకెళ్లే నెపంతో కారు ఎక్కించుకొని ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి ప్రయత్నించాడు. బాలిక కేకలు పెట్టడం, పారిపోయేందుకు ప్రయత్నించడంతో ఆమెను పట్టుకొని గొంతు నులిపి చంపేశాడు. ఆపై ఆమె మృతదేహాన్ని స్కూలు ఆవరణలో పడవేసి అమాయకత్వం నటించాడు. పోలీసులు రంగంలోకి దిగి తమదైన శైలిలో విచారణ చేపట్టడంతో చేసిన నేరాన్ని అంగీకరించాడు. ఈ ఘటన గుజరాత్‌లోని దహోద్ జిల్లాలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే 55 ఏళ్ల ప్రిన్సిపల్ గోవింద్ రోజులానే బాలికను తన కారులో ఎక్కించుకొని స్కూలుకు బయల్దేరాడు. మార్గమధ్యంలో బాలికపై అత్యాచారానికి యత్నించాడు. భయపడిన బాలిక కారు దిగి పారిపోయే ప్రయత్నం చేసింది. కేకలు పెట్టింది. దీంతో కంగారు పడిన ప్రిన్సిపల్ ఆమెను పట్టుకొని గొంతు నులిమేశాడు. ఊపిరి ఆడక బాలిక అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. అనంతరం గోవింద్ స్కూలుకు వెళ్లి కారును పార్క్ చేశాడు. సాయంత్రం పిల్లలు, సిబ్బంది వెళ్లిపోయిన తర్వాత బాలిక మృతదేహాన్ని కారులో నుంచి తీసి స్కూలు మైదానంలో పడేశాడు. ఆమె షూ, పుస్తకాలను తరగతి గది దగ్గరలో పడేశాడు. బిడ్డ ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లి స్కూల్‌కు వెళ్లి వెతికారు. ప్రిన్సిపల్‌ను ప్రశ్నించారు. బాలికను స్కూల్లో వదిలేసి వేరొక పనిపై బయటకు వెళ్లినట్లు తల్లి దగ్గర ప్రిన్సిపల్ బుకాయించాడు.

బిడ్డ జాడ లభించక తల్లడిల్లిన తల్లి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్కూలును తనిఖీ చేశారు. బాలిక మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం కోసం పంపారు. ఆమెను గొంతు నలుపి చంపేశారని నివేదికలో తేలింది. ప్రిన్సిపల్‌పై అనుమానం వచ్చి అతని ఫోను ట్రాక్ చేశారు. ఘటన జరిగిన రోజంతా అతను స్కూల్లోనే ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతనిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా అతను నేరాన్ని అంగీకరించాడు. బీఎన్ఎస్‌లోని సెక్షన్లతో పాటు పోక్సో చట్టం కింద కేసు పెట్టినట్లు సీనియర్ పోలీసు అధికారి రాజ్‌దీప్ సింగ్ తెలిపారు. ఈ ఘటనపై గుజరాత్ విద్యాశాఖ మంత్రి కుబేర్ దిండోర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'ఇది బాధాకరం. మూడు రోజుల విచారణ తర్వాత ప్రిన్సిపల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇలాంటి దారుణాలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నాం' అని అన్నారు.

పాలకపక్షంతో నిందితుడికి దగ్గర సంబంధాలు: కాంగ్రెస్

నిందితుడికి అధికార పార్టీతో దగ్గర సంబంధాలు ఉన్నాయని ప్రతిపక్ష కాంగ్రెస్ ఆరోపించింది. తమ వాదనకు బలం చేకూర్చేలా అనేక ఫోటోలు విడుదల చేశారు. ఆర్ఎస్ఎస్ యూనిఫారంలో నిందితుడు ఉండటం, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ వర్క్‌షాపుల్లో పాల్గొనడం, గుజరాత్ మాజీ మంత్రితో కలిసి ఉండటం ఆ ఫొటోల్లో కనిపిస్తోంది.

పట్టాలపై దుశ్చర్యలు సహించం: అశ్వినీ వైష్ణవ్

జైపూర్: రైళ్లు పట్టాలు తప్పేలా ఇటీవల కొన్ని కుట్రపూరిత ప్రయత్నాలు వెలుగు చూడటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలు పెట్టి రైలుకు ప్రమాదం తలపెట్టే ఘటనలు కలకలం రేపాయి. ఇటువంటి వాటిపై రైల్వేశాఖ అప్రమత్తంగా ఉందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ తరహా ఘటనలను నిర్మూలించేందుకు అనేక రాష్ట్రాల యంత్రాంగం, పోలీసులతో చర్చలు జరుపుతున్నామన్నారు. రైలు ప్రమాదాలకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జైపూర్‌లో అనేక మార్గాల్లో కవచ్ పనితీరును పరిశీలించేందుకు వచ్చిన రైల్వే మంత్రి... ఇటీవల వెలుగు చూస్తున్న దుశ్చర్యలపై మాట్లాడారు. 'రాష్ట్ర ప్రభుత్వాలు, డీజీపీలు, హోంశాఖ కార్యదర్శులతో చర్చలు జరుపుతున్నాం. ఇందులో ఎన్ఐఏ భాగస్వామ్యమైంది. అటువంటి ప్రమాదాలకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇది మా దృఢనిశ్చయం' అని అన్నారు. ఇటువంటి ఘటనలపై రైల్వే శాఖ అప్రమత్తంగా ఉందని, దీనిపై రైల్వే పోలీసులతోపాటు స్థానిక పోలీస్ స్టేషన్లతో అన్ని రైల్వే జోన్ల అధికారులు కలిసి పనిచేస్తున్నారని అన్నారు.

అద్దె ఇంట్లో రహస్య కెమెరాలు

మహిళ ఫిర్యాదు: యజమాని కుమారుడి అరెస్టు

న్యూఢిల్లీ: తాను అద్దెకు తీసుకున్న ఇంట్లో రహస్య కెమెరాలు ఉన్నట్లు ఓ మహిళ గుర్తించారు. పడక గదితో పాటు స్నానాల గదిలో వాటిని గుర్తించారు. ఈ ఘటన తూర్పు ఢిల్లీలోని షాకార్పూర్ ప్రాంతంలో జరిగింది. రంగంలోకి దిగిన పోలీసులు ఆ ఇంటి యజమాని కుమారుడు కరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. 'బాధితురాలు సివిల్స్ అభ్యర్థి, కొన్ని నెలలుగా ఆ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు.

ఎప్పుడు ఊరెళ్లినా పై అంతస్తులో ఉండే కరణ్‌కు ఇంటి తాళాలు ఇచ్చేవారు' అని డీసీపీ (తూర్పు) అపూర్వ గుప్తా తెలిపారు. 'తొలుత బాధితురాలి వాట్సాప్‌లో అనుమానస్పదంగా ఏదో కనిపించింది. ఆపై తన అకౌంట్ గుర్తు తెలియని ల్యాప్‌ట్యాప్‌లో లాగిన్ అయి ఉన్నట్లు గుర్తించి వెంటనే లాగ్ అవుట్ చేశారు. ఇంట్లో రహస్య కెమెరాలు లేక సర్వైలెన్స్ కెమెరాలు ఉన్నాయన్న అనుమానంతో వెతికితే స్నానాల గదిలోని బల్బ్ హోల్డర్‌లో ఒక కెమెరా దొరికింది. పోలీసు బృందం సోదా చేయగా పడక గదిలోని బల్బ్‌హోల్డర్‌లో మరొక కెమెరా లభ్యమైంది' అని డీసీపీ చెప్పారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాధితురాలు మూడు నెలల కిందట సొంతూరు వెళ్లారు. అప్పుడు ఇంటి తాళాలు కరణ్‌కు ఇచ్చారు. ఇదే అవకాశమనుకొని మార్కెట్‌లో లభించే స్పై కెమెరాలను ఆమె బెడ్‌రూమ్, బాత్‌రూమ్‌లో అతను దాచాడు. వాటిని ఆన్‌లైన్‌లో ఆపరేట్ చేసేందుకు వీలు లేక వీడియోలను మెమరీ కార్డులో నిల్వచేశాడు. మరమ్మతుల నెపంతో ఏదో ఒక కారణంతో ఆమె నుంచి తరచూ ఇంటి తాళాలు తీసుకొని అతను తన పనిని కానిచ్చేవాడు' అని డీసీపీ చెప్పారు.

దర్యాప్తులో నిందితుడు తన నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. కరణ్ నుంచి మరొక కెమెరా, రెండు లాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. బీఎన్ఎస్‌లోని సెక్షన్ 77 కింద షాకార్పూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి అతనిని అరెస్టు చేసినట్లు తెలిపారు. గ్రాడ్యుయేట్ అయిన కరణ్ దివ్యాంగుడు. గత ఏడేళ్లుగా పోటీ పరీక్షలు రాస్తున్నాడు. అతనికి నేర చరిత్ర లేదు అని పోలీసు అధికారి వెల్లడించారు.

హోటళ్లకు సీసీటీవీలు... చెఫ్‌లు, వెయిటర్లకు మాస్కులు

యోగి సర్కారు ఆదేశాలు

లక్నో: వినియోగదారులకు పరిశుభ్రమైన ఆహారం అందాలనే లక్ష్యంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. హోటళ్లు, రెస్టారెంట్లకు కీలక ఆదేశాలు ఇచ్చింది. పని సమయంలో చెఫ్‌లు, వెయిటర్లు మాస్కులు, గ్లౌవ్స్ ధరించాలని వెల్లడించింది. ఆహారశాలల వద్ద సీసీటీవీ ఏర్పాటు తప్పనిసరి చేసింది. అంతేగా కుండా హోటళ్లతో సహా జ్యూస్ షాప్‌ల వద్ద వాటి నిర్వాహకులు, మేనేజర్లు తమ పేర్లు, చిరునామాలు ప్రదర్శి ంచాలని పేర్కొంది. తినే పదార్థాల్లో ఉమ్మివేసినట్లు, మూత్రం కలిపినట్లు వార్తలు రావడంతో ఈ ఆదేశాలు ఇచ్చిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఉన్నతస్థాయి సమావేశంలో భాగంగా ముఖ్యమంత్రి యోగి మాట్లాడుతూ 'ఆహారపదార్థాల్లో మానవ వ్యర్థాలు రావడం అసహ్యకరం. అవి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఆ తరహా ప్రవర్తనకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని సూచించారు. సహరాన్‌పూర్‌లోని రోటీలు చేస్తుండగా... ఒక యువ కుడు వాటిపై ఉమ్మివేస్తున్నట్లుగా ఉన్న వీడియో వైరల్ అయింది. ఘజియాబాద్‌లోని ఒక విక్రేత జ్యూస్‌లో మూత్రం కలిపినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ తరహా ఘటనల్లో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వరుస పరిణామాలపై సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. 'దాబాలు, రెస్టారెంట్లు, ఇతర ఆహారశాలలను క్షుణ్ణంగా పరిశీలించాలి. అక్కడ పనిచేసే ఉద్యోగులను పోలీసులు తనిఖీ చేయాలి. ఆహార పదార్థాల స్వచ్ఛతను కాపాడేలా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్‌కు తగిన సవరణలు చేయాలి' అని ఆదేశాలు ఇచ్చారు.

ఎమ్మెల్యే ముకేశ్ అరెస్ట్... విడుదల

తిరువనంతపురం: లైంగికదాడి కేసులో నటుడు, సీపీఎం ఎమ్మెల్యే ఎం.ముకేశ్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. బెయిల్ లభించడంతో వెంటనే ఆయన విడుదలయ్యారు. జస్టిస్ హేమ కమిటీ నివేదిక మలయాళీ సినీ పరిశ్రమను కుదిపేస్తోంది. ముకేశ్‌పైనా ఇలాంటి ఆరోపణలే వచ్చాయి. ఆయనపై కేరళ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రస్తుతం ఆయన మీటూ కేసులో విచారణ ఎదుర్కొంటున్నారు. ఇందులో భాగంగానే కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం ముందు విచారణకు హాజరయ్యారు. విచారణలో భాగంగా అతన్ని మూడు గంటల పాటు అధికారులు ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్న పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం ఎర్నాకులం జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, ఆయనకు కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో వైద్య పరీక్షల అనంతరం విడిచిపెట్టారు.

సైద్ధాంతిక వ్యవస్థ నాశనం ఎవరి తరం కాదు

- అమిత్ షా వ్యాఖ్యలు ఆక్షేపణీయం
- శ్రీలంక విజయం వామపక్షాలకు శుభ పరిణామం
- సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: 'దేశంలో వామపక్షశక్తులను అంతమొందిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆయన వ్యాఖ్యలు ఆక్షేపణీయం. వ్యక్తులను తుదముట్టించ వచ్చునేమో కానీ... రాజకీయ సైద్ధాంతిక వ్యవస్థను నాశనం చేయడం ఎవరితరం కాదు. అమిత్ షా కత్తితో సావాసం చేస్తున్నారు. ఆయన దానికే బలైపోవడం ఖాయం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతం ఎన్నో ఆటుపోట్లుకు గురై నిలదొక్కుకుంటోంది. శ్రీలంక ఎన్నికల్లో ఎర్రజెండా రెపరెపలాడటం ఇందుకు నిదర్శనం. ఈ విజయం వామపక్ష పార్టీలకు శుభ పరిణామం' అని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలో గల గంధమనేని శివయ్య భవన్‌లో మంగళవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. అమిత్ షా అధికార మదంతో మాట్లాడుతున్నారని, ఆయుధాలతో వ్యక్తులను హతమార్చవచ్చునేమో కానీ... సైద్ధాంతిక వ్యవస్థను ధ్వంసం చేయడం ఆయన అబ్బతరం కాదని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సైద్ధాంతిక వ్యవస్థను ధ్వంసం చేయడానికి అమిత్ షా ప్రయత్నిస్తే... అందులోనే ఆయన హతమైపోతాడని నారాయణ హెచ్చరించారు. వ్యవస్థలోని లోపాలు ఎత్తి చూపినపుడు వాటిని పరిశీలించి పరిష్కరించాలే తప్ప... ఇలా కక్ష సాధింపు ధోరణులకు పాల్పడటం మంచిది కాదని హితవు పలికారు. లోపాలు ఎత్తి చూపినందుకు వామపక్ష తీవ్రవాద ముద్ర వేసి అంతమొందిస్తామని చెప్పడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అయిన భారతదేశంలో బీజేపీ శక్తులు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. భారత్‌లో లౌకికవాదాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తే...ఎవరికి వారే ధ్వంసమైపోతారని నారాయణ హెచ్చరించారు. మోదీ వంద రోజుల పాలనలో ఏం చేశారో చెప్పాలని ఆయన నిలదీశారు. సార్వత్రిక ఎన్నికల్లో తమకు 400 సీట్లు వస్తాయని చెప్పిన మోదీకి ఎదురు దెబ్బ తగిలిందన్నారు. రాముడి పేరుతో ఓట్లు సంపాదించాలనుకున్న బీజేపీ... అయోధ్యలోనే ఓటమి చెందిందన్నారు. నరేంద్రమోదీ నైతికంగా ఓడి పోయారని, సాంకేతికంగా మాత్రమే ఆయన గెలిచారన్నారు. నరేంద్రమోదీకి అక్షయ పాత్రలా చంద్రబాబునాయుడు, నితీశ్‌కుమార్ అండగా నిలిచారని నారాయణ చెప్పారు. మోదీ పట్ల ఆర్‌ఎస్‌ఎస్ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఆయనకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారని నారాయణ చెప్పారు. మోదీని మార్చాల్సిందేనని ఆర్‌ఎస్‌ఎస్ నేతలు పట్టుబడుతున్నారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నేతల అసంతృప్తిని చల్లార్చడానికి చంద్రబాబు ప్రయత్నించి మళ్లీ మిన్నకుండిపోయారన్నారు. దేశవ్యాప్తంగా రాజకీయ మార్పు జరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మోదీ పాలనలో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందన్నారు. అవినీతికి మారుపేరైన అదానీ పేరు ప్రపంచవ్యాప్తంగా మారు మోగుతోందన్నారు. ఆర్థిక వ్యవస్థను అదానీ ధ్వంసం చేస్తున్నారని నారాయణ ఆరోపించారు. అలాంటి అదానీకి అండగా మోదీ నిలబడటం బాధాకరమన్నారు. అందుకే మోదీకి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధమవుతున్నారన్నారు. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను పూర్తిగా మార్చేస్తోందని, దీని వలన శ్రామికవర్గం అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యార్థిని హత్యాచారం కేసులో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తప్పు చేశారని నారాయణ అభిప్రాయపడ్డారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడ ఉన్నందునే బీజేపీ వారు ఆందోళనలు చేస్తున్నారని, అదే మహారాష్ట్రలో ఇలాంటి ఘటనలు జరిగితే బీజేపీ వారు ఎందుకు ఆందోళనలు చేయలేదని నారాయణ ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలే బీహార్, ఉత్తరప్రదేశ్‌లో జరిగినా బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ఘటనలు వ్యతిరేకించే వారిని రాజకీయం చేస్తున్నారంటూ ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. ఒకే దేశం... ఒకే ఎన్నిక పేరుతో మోదీ ప్రభుత్వం జమిలి ఎన్నికలకు ప్రయత్నించడం మంచిది కాదని నారాయణ హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో ఇది సాధ్యం కాదన్నారు. రాష్ట్రాలకు హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నగరి వద్ద తాను చేసిన ఉద్యమం జాతీయ స్థాయిదన్నారు. జాతీయ రహదారి వద్దని స్థానిక రైతులు వ్యతిరేకించినా... తానే అపుడు వారిని ఒప్పించానన్నారు. ఇపుడు దారి లేకపోతే రైతులు తమ పొలాల్లోకి ఎలా వెళ్లాలని నారాయణ ప్రశ్నించారు. ఈ సమస్యపై పాలకులు స్పందించకపోవడంతో రైతుల కోసమే తాను అక్కడ జాతీయ రహదారిపై నిరసన చేశానని ఆయన తెలిపారు. తిరుమల ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించిందని, టీటీడీ పవిత్రతను దెబ్బ తీయడం మంచిది కాదన్నారు. జగన్ అమలు చేసిన రివర్స్ టెండర్ విధానంతో ఈ లోపం జరిగిందని నారాయణ చెప్పారు. కల్తీ లడ్డు కారణంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో పర్యటించిన మంత్రి నిమ్మల రామానాయుడు హంద్రీనీవాకు నీళ్లు ఎందుకు వదలలేదో సమాధానం చెప్పాలన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు హంద్రీనీవా ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని, నేటికీ శ్రీశైలం నుండి పోతిరెడ్డిపాడు ద్వారా ఎందుకు నీరు వదలడం లేదని ప్రశ్నించారు. వంద రోజుల పరిపాలన మంచిగా ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు... సూపర్ సిక్స్ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. చాలా నియోజకవర్గాలలో సూడో ఎమ్మెల్యేలు ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారు స్కీమ్ వర్కర్లను తొలగించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని, దీనిపై పోరాటం సాగిస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, నగర కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుండి యథావిధిగా ఇసుక లోడింగ్

లారీల యజమానులతో ప్రభుత్వ చర్చలు సఫలం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉచిత ఇసుక రవాణాకు సంబంధించి లారీల యజమానులు ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. ప్రభుత్వం నిర్దేశించిన విధానంలోనే రవాణా కార్యకలాపాలు నిర్వహించేందుకు వారు అంగీకరించారు. మంగళవారం సచివాలయంలోని గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా సమక్షంలో చర్చలు నిర్వహించారు. గనుల శాఖ సంచాలకులు ప్రవీణ్ కుమార్ లారీ యజమానుల సంఘాలతో ఉదయం నుండి పలు ధఫాలుగా చర్చలు జరిపి, వారి అనుమానాలను నివృత్తి చేసారు. అనంతరం వారిని సచివాలయానికి తీసుకు వచ్చారు. ప్రధానంగా ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం కోసం లారీ యజమానులకు డిపాజిట్, అఫిడవిట్ విధానం ప్రవేశ పెట్టగా, దాని నుండి మినహాయించాలని వారు కోరారు. దానికి ప్రభుత్వ పక్షాన మంత్రి రవీంద్ర అంగీకరిస్తూ దాని స్థానంలో రిజిస్ట్రేషన్ విధానం అమలు అవుతుందన్నారు. అయితే ప్రభుత్వ నిబంధనలు పాటించవలసిందేనని, ఇందుకు అవసరమైన సవరణ మార్గదర్శకాలను బుధవారం జారీ చేస్తామన్నారు. అయితే రవాణా వ్యవహారాలు ఆటంకం కలుగరాదన్నారు. జీపీఎస్ అధారిత విధానం తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రభుత్వం నిర్ధేశించిన రవాణ చార్జీలను పాటించాలని, రిజిస్ట్రేషన్ తప్పనిసరని ముఖ్యమంత్రి ఇప్పటికే స్పష్టం చేశారన్నారు. విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సీఎం నూతన విధానానికి అంకురార్పణ చేశారన్నారు. యాప్ ద్వారా మాత్రమే ఎగుమతి అనుమతులు మంజూరు అవుతాయని మీనా స్పష్టం చేసారు. తొలుత ప్రభుత్వ ఆలోచనా ధోరణికి అనుగుణంగా లారీ యజమానులు వ్యవహరించాలని సూచించారు. కొన్ని ప్రాంతాలలో మైనింగ్ కార్యకలాపాలకు సంబంధించి చిన్న చిన్న తప్పులకు సైతం భారీ జరిమానాలు విధించారని సంఘాల ప్రతినిధులు మీనా దృష్టికి తీసుకురాగా, అన్ని జిల్లాల కలెక్టర్‌లకు స్పష్టమైన సూచనలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ముకేశ్‌కుమార్ మీనా మాట్లాడుతూ రవాణా పరంగా గత రెండు, మూడు రోజులుగా ఏర్పడిన స్వల్ప అడ్డంకులు తొలగిపోయాయని, బుధవారం నుండి పెండింగ్‌లో ఉన్న ఇసుక లోడింగ్‌ను కూడా ప్రారంభిస్తామని తెలిపారు.

జమిలి ఎన్నికలు అసాధ్యం

తులసిరెడ్డి స్పష్టీకరణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: భిన్నత్వంలో ఏకత్వం... సమాఖ్య వ్యవస్థ కొనసాగుతున్న భారతదేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని రాజ్యసభ మాజీ సభ్యులు, ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. గుంటూరులో జనచైతన్య వేదిక అధ్వర్యంలో 'జమిలి ఎన్నికలు అవసరమా? సాధ్యమా?' అనే అంశంపై జరిగిన చర్చా గోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారితీస్తుందని విమర్శించారు. ఈ ఎన్నికలతో స్థానిక సమస్యల ప్రాధాన్యతలు తగ్గుతాయని, అవినీతి తారస్థాయికి చేరుతుందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదేళ్లలో రూ.500 లక్షల కోట్లు బడ్జెట్ వ్యయం చేస్తుంటే... అందులో ఎన్నికల కోసం రూ.10 వేల కోట్లు అనేది కేవలం 0.01 శాతం మాత్రమేనన్నారు. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలలో అధ్యక్ష ఎన్నికలు, సెనేట్ ఎన్నికలు, ది హౌస్ ఆఫ్ పీపుల్స్ రిప్రజెంటేటివ్ ఎన్నికలు, గవర్నర్ ఎన్నికలు, స్థానిక ఎన్నికలు విడివిడిగా జరుగుతున్నా అభివృద్ధిలో పతాకస్థాయికి చేరిందని మోదీ ప్రభుత్వం చెబుతున్నట్టుగా ఎన్నికలు విడివిడిగా జరగడం వలన అభివృద్ధికి నోచుకోలేకపోతున్నామనేది అర్థరహితమన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి కావలసిన భద్రతా సిబ్బంది, ఈవీఎంలు అందుబాటులో ఉండటం కష్టతరమవుతుందని, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలనే ఏడు దఫాలుగా నిర్వహించిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జమిలి ఎన్నికలు అమల్లోకి రావాలంటే రాజ్యాంగంలో ఆరు సవరణలు చేయాలని అన్నారు. జమిలి ఎన్నికలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, బహుపార్టీ వ్యవస్థను, ఫెడరిలిజాన్ని దెబ్బతీస్తుందని తెలిపారు. 2022లోనే జాతీయ లా కమిషన్ జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి, రాజ్యాంగపాలన పద్ధతికి భంగకరమని తెలిపిందన్నారు. 1967 వరకు దేశంలో లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయని, ఆ తర్వాత సంకీర్ణ రాజకీయాలు, సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కోటి లోపు జనాభా ఉన్న 100 దేశాలు ప్రపంచంలో ఉన్నాయని, ఇలాంటి పరిస్థితులలో అత్యధిక జనాభా గల రాష్ట్రాలు భారతదేశంలో జమిలి ఎన్నికల ద్వారా స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత దశాబ్దకాలంగా ఈడీ, సీబీఐ, ఐటీ వ్యవస్థలను ప్రతిపక్ష నేతలపై ప్రయోగించి తమ వైపుకు తిప్పుకుంటున్నదని ఆరోపించారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం కూడగట్టడానికి ప్రజాచైతన్య సదస్సులు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని ప్రకటించారు. చర్చా గోష్టిలో ప్రముఖ విద్యావేత్త మేకల రవీంద్రబాబు, రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, నేస్తం సహ వ్యవస్థాపకులు టి.ధనుంజయ రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

మైనార్టీ సంక్షేమ న్యాయ శాఖ మంత్రి ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: జాతి కుల మత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం అయినప్పుడే దేశ అభివృద్ధి పరుగులు పెడుతుందని రాష్ట్ర మైనార్టీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. లబ్బీపేట జి.ఆర్.టి హెూటల్ లో అఖిలభారత మానవతా సందేశ సమితి సంస్థ ఆధ్వర్యంలో అవర్ సొసైటీ- అవర్ రెస్పాన్సిబిలిటీ పేరుతో డైలాగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిధిగా మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూక్, అతిథులుగా రిటైర్డ్ ఐజీ వెంకటేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి సమరం, డాక్టర్ దుర్గారావు, రిటైర్డ్ జడ్జి డాక్టర్ చక్రధర్, మైనారిటీ ప్రతినిధులు మౌలానా బిలాల్ అహ్మద్ నద్వి, ఫారూఖ్ షుబ్లీ ఫాదర్ జోసఫ్, సర్దార్ పింకీ జి హరి సిందర్ సింగ్ తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ మానవతా విలువలతో జీవనం సాగించినప్పుడే, కష్టాల్లో ఉన్న ఎదుటివారిని ఆదుకోవడం ద్వారా, అండగా నిలబడడం ద్వారా మానవత్వం పరిమళిస్తుందని అన్నారు. నైతిక విలువలు, ప్రేమ, నమ్మకం, సత్ ప్రవర్తనతో కూడిన క్రమశిక్షణ తదితర వాటిని ప్రతి ఒక్కరూ అనుసరిం చడం, ఆచరించడం ద్వారా మన సమాజం -మన బాధ్యత నినాదంతో సమాజాభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలని పిలుపునిచ్చారు. విపత్తు కారణంగా దిక్కుతోచని స్థితిలో ఉన్న ముంపు వరద బాధితులను ఆదుకునేందుకు కుల మతాలకు అతీతంగా వేల సంఖ్యలో దాతృత్వ చేతులు అండగా నిలవడమే మన సమాజం- మన బాధ్యత జ్ఞప్తికి తెచ్చిందని అన్నారు.

30వ తేదీ వరకు హజ్ దరఖాస్తు గడువు పొడిగింపు

హజ్ యాత్ర కోసం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2025కు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువును మరో సారి పొడిగించినట్లు మంత్రి ఎన్ఎండి ఫరూక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హజ్ దరఖాస్తుల గడువును ఈ నెల 30వ తేదీ వరకు మరో సారి కేంద్ర హజ్ కమిటీ పొడిగించినట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్లేందుకు ఇప్పటి వరకు 1937 మంది ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ఇందులో 1589 దరఖాస్తులు అన్ని అంశాలతో కరెక్ట్‌గా ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తీసుకున్న చర్యల్లో భాగంగా ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించబోతున్నట్లు తెలిపారు. విజయవాడ గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి హజ్‌కి వెళ్లే రాష్ట్ర ప్రయాణికులకు మాత్రమే ఈ సౌలభ్యం ఉంటుందని మంత్రి తెలిపారు.

యువత సాధికారత కోసం మూడు కేంద్రాలు

రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, రూ.105 కోట్లతో మూడు ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా మైనారిటీ యువత నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు కార్యాచరణ అమలు చేయబోతున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. ఒక్కొక్క కేంద్రాన్ని రూ. 35 కోట్లతో మైనారిటీ జనాభా ఎక్కువ గల గుంటూరు, నంద్యాల, అనంతపురం జిల్లా కేంద్రాలలో నెలకొల్పనున్నట్లు తెలిపారు. నైపుణ్య అభివృద్ధి శిక్షణలో భాగంగా ఏ.ఐ మరియు డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అధిక డిమాండ్ ఉన్న అధునాతన కోర్సులలో మైనార్టీ యువతకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

పట్టాలు తప్పడంలో భారతీయ రైల్వేల ప్రపంచ రికార్డు: మమత

కోల్‌కతా: భారతీయ రైల్వేస్‌పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. పట్టాలు తప్పడంలో ఇండియన్ రైల్వే ప్రపంచ రికార్డు సృష్టించిందని అన్నారు. పశ్చిమబెంగాల్‌లోని జల్‌పాయ్‌గురి జిల్లాలో ఖాళీగా వెళ్తున్న గూడ్సురైలుకు చెందిన ఐదు బోగీలు మంగళవారం ఉదయం పట్టాలు తప్పిన నేపథ్యంలో మమతా బెనర్జీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'రైల్వేలకు ఏం జరిగింది? ఇవాళ కూడా పట్టాలు తప్పిన వార్త వచ్చింది. పట్టాలు తప్పిన ఘటనల్లో రైల్వే శాఖ ప్రపంచ రికార్డు సృష్టించింది. ప్రజల భద్రత ప్రమాదంలో పడింది. రైళ్లలో ప్రయాణించాలంటేనే భయపడుతున్నారు. రైల్వే మంత్రి ఎక్కడున్నారు? ఎన్నికల్లో ఓట్ల కోసం రావడం వల్ల ప్రయోజనం లేదు. ప్రజలు ప్రమాదంలో ఉన్నప్పుడు వారి పక్షాన ఉండాలి' అని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు. కేంద్ర రైల్వేమంత్రిగా మూడుసార్లు తాను పనిచేసినప్పుడు ఆ శాఖను సాఫీగా నడిపానని, పశ్చిమబెంగాల్‌కు రూ.2 లక్షల కోట్లు విలువచేసే ప్రాజెక్టులు కేటాయించినట్టు చెప్పారు. కాగా, మమతా బెనర్జీ వ్యాఖ్యలపై అశ్విన్ వైష్ణవ్ స్పందించారు. మమతా బెనర్జీకి రాజకీయాలు చేయడమే కానీ... రైల్వే భద్రత గురించి అవగాహన లేదన్నారు. రైల్వే మంత్రిగా ఆమె హయాంలో ఆటోమేటిక్ యాంటీ-కొలిజన్ డివైజ్‌ను ఏర్పాటు చేశారనీ, అయితే దానికి సేఫ్టీ సర్టిఫికేషన్, సరైన పరీక్షలు లేనందున 1,500 కిలోమీటర్ల తర్వాత దాన్ని తొలగించారని చెప్పారు.

పీఆర్‌లో కారుణ్య నియామకాలపై డిప్యూటి సీఎం పవన్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పంచాయతీరాజ్ సంస్థల్లో పని చేసే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉద్యోగులు, వాటి పరిధిలో ఉండే ఉపాధ్యాయులు మరణిస్తే వారి వారసులకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పవన్ కల్యాణ్ సమీక్షించారు. తన కార్యాలయానికి కారుణ్య నియామకాలపై అర్జీలు వస్తున్న దృష్ట్యా పవన్ ఈ అంశంపై అధికారులతో సమావేశమయ్యారు. ఈ నియామకాల ప్రక్రియలో నెలకొంటున్న జాప్యం, నిబంధనలపై వివరాలు తీసుకున్నారు. మరణించిన ఉద్యోగులు పంచాయతీరాజ్ సంస్థల పరిధిలో ఉన్నందున వారి వారసులకు అదే సంస్థల్లో నియమించాల్సి ఉంటుందని, ఖాళీలు తక్కువ ఉండటంతో కారుణ్య నియామకాలు ఆలస్యం అవుతున్నాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పీఆర్ సంస్థలలో కారుణ్య నియామకాల కోసం వేచి చూస్తున్నవారికి జిల్లా కలెక్టర్ కామన్ పూల్‌లో ఉన్న ఖాళీలలో అవకాశం కల్పించే అంశంపై చర్చించారు. ఈ దిశగా నియామకాలు చేసే విషయంపై సాధారణ పరిపాలన శాఖతో చర్చించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్‌కు ఉప ముఖ్యమంత్రి సూచించారు.

సీఎం సహాయ నిధికి ఏసీఏ కోటి విరాళం

విశాలాంధ్ర-విజయవాడ: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటి రూపాయల చెక్కును ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఎంపీ శివనాథ్ ఏసీఏ తరపున వరద బాధితులకు కోటి రూపాయలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు చంద్రబాబుకు కోటి రూపాయలు చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు వెంకట ప్రశాంత్, కార్యదర్శి సానా సతీశ్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ గౌరు విష్ణుతేజ్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నేడే పరిహారం చెల్లింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు తీవ్రంగా నష్టపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పరిహారం విడుదల చేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ కలెక్టరేట్ నుంచి బాధితులకు ఈ పరిహారాన్ని నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేయనున్నారు. వర్షాలు, బుడమేరు వరదలకు విజయవాలోని అనేక ప్రాంతాలు ముంపునకు గురై ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో ఆస్తులకు, పంటలకు తీవ్ర నష్టం జరిగింది. మునుపెన్నడూ చూడని విధంగా వరదలకు విజయవాడ అతలాకుతలమైంది. చంద్రబాబు పది రోజులు విజయవాడ కలెక్టరేట్‌లోనే మకాం వేసి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు అందేలా యంత్రాన్ని నడిపించారు. నష్టపోయిన బాధితులకు పరిహారం అందజేయడానికి ప్రభుత్వం ఎన్యుమరేషన్ పూర్తి చేసింది. బాధితులకు నష్టపరిహారం ప్యాకేజీని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. అర్హులైన బాధతులందరికీ నేరుగా వారి ఖాతాల్లోనే ప్రభుత్వం పరిహారం డబ్బులు జమ చేయనుంది. వరదల్లో నష్టపోయిన వాహనాలకు బీమా చెల్లింపు కార్యక్రమం ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ధాన్యానికి బోనస్ రూ.500 ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై జారీ చేసిన మార్గదర్శకాల్లో బోనస్ అంశం లేకపోవడం దురదృష్టకరమని, క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుసేవా కేంద్రాలు, ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసే ప్రక్రియలో అవకతవకలు జరగకుండా చర్యలు చేపట్టాలని, సేకరించిన ధాన్యానికి వారంలోగా రైతులకు సొమ్ము చెల్లించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,300, గ్రేడ్-ఏ రకానికి రూ.2,320 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే పెరిగిన వ్యవసాయ ఖర్చులు, భారీ వర్షాలు, రాయలసీమ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రతి క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ధాన్యం సేకరణ సమయంలో రైతుసంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

రాజ్యసభకు ఆర్.కృష్ణయ్య రాజీనామా

రాజ్యసభలో 8కి పడిపోయిన వైసీపీ బలం

ఇటీవల మోపిదేవి, బీదా మస్తాన్ రాజీనామా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఆర్.కృష్ణయ్య రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామాను రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్‌కు సోమవారం అందజేశారు. దానిని ఆమోదించినట్లు మంగళవారం చైర్మన్ ధ్రువీకరించారు. ఆర్.కృష్ణయ్య రాజీనామాతో వైసీపీ బలం ఎనిమిదికి పడిపోయింది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైంది. అధికారంలోకి టీడీపీ కూటమి వచ్చే నాటికి 11మంది రాజ్యసభ సభ్యుల బలం వైసీపీకి ఉంది. రాజ్యసభలో తమకున్న బలంతో కేంద్రంపై అనేక అంశాల్లో బిల్లులపై ఒత్తిడి చేయవచ్చనే వ్యూహంతో వైసీపీ అధినేత జగన్ ఉన్నారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో ఇటీవల వైసీపీకి చెందిన ఇద్దరు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ, బీదా మస్తాన్ యాదవ్ రాజీనామా చేశారు. అప్పటితో రాజ్యసభ సభ్యుల బలం 9 స్థానాలకు పడిపోయింది. తాజాగా కృష్ణయ్య రాజీనామాతో 8కి పడిపోయింది. కృష్ణయ్య పదవీ కాలం ఇంకా నాలుగేళ్లపాటు ఉందని, అయినప్పటికీ బీసీ ఉద్యమం కోసం రాజీనామా త్యాగం చేసినట్లు వివరించారు. అటు లోక్‌సభలో వైసీపీకి బలం లేదు. రాజ్యసభ ఎంపీల బలం ఉందని, తమ అవసరం కేంద్రానికి ఉంటుందని వైసీపీ నేతలు చెప్పుకుంటూ వచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే రాజ్యసభలోని ముగ్గురు ఎంపీలు రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం రాజ్యసభలో వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబురావు, వి.విజయసాయిరెడ్డి, నిరంజన్ రెడ్డి, మేడా రఘునాథరెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, సుభాష్ చంద్రబోస్ పిల్లి, నత్వాని పరిమళ్ ఉన్నారు. వీరిలో ఎంత మంది నిలుస్తారనేదీ వైసీపీకి ప్రశ్నార్థకంగా మారింది.

వైసీపీ అక్రమాలు దాచి పెట్టలేరు: టీడీపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమలలో వైసీపీ చేసిన పాపాలను వక్రభాష్యాలతో తుడిచి పెట్టలేరని, పాపాలు కప్పిపుచ్చుకోవాలని తప్పుడు ప్రచారంతో జగన్ ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తిరుమల కేంద్రంగా గత ప్రభుత్వంలో చేసిన అక్రమాలు, పాపాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. డబ్బు కక్కుర్తితో ఏఆర్ ఫుడ్స్ లాంటి కంపెనీలతో కుమ్మక్కై వేంకటేశ్వరస్వామి వారి నైవేద్యం లడ్డూ ప్రసాదాన్ని జంతువుల కొవ్వుతో కలుషితం చేశారని... ఇది మహాపాపం అని దుయ్యబట్టారు. చేసిన పాపం తాలుకా వాస్తవాలు అనేక ల్యాబ్ రిపోర్టుల ద్వారా బయటపడినా కూడా జగన్ రెడ్డి అండ్ కో బుకాయించే ప్రయత్నంలో ఉన్నారన్నారు. తప్పుడు రాతలు రాయిస్తూ, వక్రభాష్యాలు పలుకుతూ ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మీడియాలో ఉన్న కొంత మంది పెయిడ్ అర్టిస్టులను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో ట్వీట్ లను పెట్టించడం, స్టేట్ మెంట్లు ఇప్పించడం లాంటి కార్యక్రమాలకు తెర లేపారన్నారు. మంత్రి నారా లోకేశ్ చాలా స్పష్టంగా సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తే దాన్ని కూడా వక్రీకరించి మాట్లాడారన్నారు. రిపోర్టు రావడంతోనే ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్ లో పెట్టడంతో పాటు విజిలెన్స్ విచారణకు ఆదేశించడం జరిగిందన్నారు. మళ్లీ కొత్త టెండర్ ను ఆహ్వానించి కర్నాటక మిల్క్ ఫెడరేషన్ వారి నందిని నెయ్యి సరఫరా పునరుద్ధరించడం జరిగిందని తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు తర్వాత సీఎం చంద్రబాబుకి టీడీపీ ఒక నివేదిక ఇచ్చిందని, అప్పుడు ఆయన ప్రకటన చేశారని వివరించారు. పొన్నవోలు సుధాకరరెడ్డి బాధ్యత లేకుండా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్ ద్వారా విచారణ చేసి తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని పట్టాభి రామ్ తెలియజేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.